

రామేశ్వరం ఆలయ గోపురం

వరదనీటితో కుంగిన కుందూ బ్రిడ్జి

● రాకపోకలకు ఆటంకం



బ్రిడ్జిపై ఏర్పడిన గుంత



భూమిలోకి కుంగిన పిల్లర్

చాపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం గ్రామం వద్ద కుందూనదిపై నిర్మించిన బ్రిడ్జి పిల్లర్స్ వరదనీటి ఉధృతికి కుంగిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వారం రోజులపాటు బ్రిడ్జిపై 30 వేల సెక్యూస్కెల నుంచి 53 వేల క్యూసెక్కుల వరకు వరదనీరు ప్రవహించింది. దీంతో తూర్పువైపు నుంచి 8వ పిల్లర్ అర్ధ అడుగు భూమిలోకి కుంగింది. బ్రిడ్జి పైభాగంలో నెర్రలు చీలి దెబ్బతింది. పలు చోట్ల చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ఏడేళ్ల క్రితం ఈ బ్రిడ్జిపై తారు, సిమెంటుతో ప్యాచింగ్ పనులు చేశారు. సిమెంటుతో వేసిన లేయర్ రెండు చోట్ల కోసుకుపోయింది. ప్రస్తుతం ఈ బ్రిడ్జిపై వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. ఈ బ్రిడ్జి పైనుంచి అల్లాడుపల్లె, పెద్దగురవలూరు, చిన్నగురవలూరు, సన్నపల్లె, మరో ఆరు గ్రామాల ప్రజలు ప్రతి రోజు వెళుతుంటారు. అల్లాడుపల్లె వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు ప్రొద్దుటూరు నుంచి కూడా భక్తులు వస్తుంటారు. బ్రిడ్జి దెబ్బతినడంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. ఎక్కువ బరువున్న వాహనాలు వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సర్వీసులోకి ఆర్టీపీపీ యూనిట్లు



ఎర్రగుంట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో రెండు యూనిట్లను శనివారం సర్వీసులోకి తీసుకున్నారు. మొంథా తుఫాను కారణంగా భారీగా పడిపోయిన విద్యుత్ డిమాండ్‌తో ఆర్టీపీపీలోని దాదాపు అన్ని యూనిట్లలో ఉత్పత్తిని నిలిపివేశారు. అయితే మళ్లీ విద్యుత్ డిమాండ్ పెరగడంతో శనివారం ఉదయం 600 మెగావాట్ల సామర్థ్యంగల 6వ యూనిట్‌ను లైటప్ చేయడంతో సాయంత్రం 7గంటలకు 90మెగా వాట్లతో నడుస్తోంది. అలాగే 2వ యూనిట్‌ను కూడా సాయంత్రం లైటప్ చేయడంతో రాత్రికి పూర్తిస్థాయిలో ఉత్పత్తి కొనసాగిస్తుందని సీఈ వాసుదేవరావు తెలిపారు. 1వ యూనిట్ 120 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో నడుస్తోంది.

రామలింగేశ్వరా...

● ప్రతి ఏడాది లక్షల్లో సాగుతున్న దందా ● అధికారుల అండదండలు పుష్కలం
● అభివృద్ధి కార్యక్రమాలు శూన్యం ● విజిలెన్సు విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి..


'ముక్తి' ఎప్పుడో!

ఉత్సవ కమిటీల పేరిట చందాల వసూళ్లు ● ఆలయ రికార్డుల్లో నమోదుకాని జమా ఖర్చులు

ప్రొద్దుటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరుగాంచిన రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం అవినీతి కేటుగాళ్లకు నిలయంగా మారింది. ఈ ఆలయంలో దేవదాయశాఖ అధికారులు నామమాత్రంగా విధులు నిర్వహిస్తారు. ఇక్కడ పెత్తనమంతా ట్రస్టుబోర్డు చైర్మన్‌తో ఉత్సవ కమిటీలదే అనే ఆరోపణలు ఉన్నాయి. 2017 సంత్సరంలో దేవాలయ అభివృద్ధి కమిటీ పేరుతో ప్రైవేటు కమిటీకి బీజం పడింది. ఈ కమిటీ ముఖ్యంగా నాడు దేవస్థానానికి సంబంధించి ఉన్న రథంను ఆధునీకరించి, పెద్ద రథం తయారీ చేసి రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాటైంది. ఇందుకోసం భక్తులు, ప్రజల నుంచి విరాళాలు సేకరించాలని నిర్ణయించారు. కానీ దేవాలయం అభివృద్ధి పేరిట అప్పట్లో భక్తులు, దాతల నుంచి ఆలయ అధికారులకు సంబంధం లేకుండా లక్షల్లో అక్రమంగా వసూళ్లు చేశారు. అయితే ఆలయంలో ఎటువంటి అభివృద్ధి పని చేయలేదు. రథం కూడా కొత్తది ఏర్పాటు కాలేదు. కానీ ఈ వసూళ్లు అయిన చందాల డబ్బులకు ఆలయ రికార్డుల్లో ఎటువంటి నమోదులు లేవు. ఈ తతంగతం అంతా కొందరు పెద్ద మనుషులు సాగిస్తున్న అక్రమదందా అని భక్తులు వాపోతున్నారు.

ఈవో అనుమతిలేకుండానే ఉత్సవ కమిటీలు

దేవదాయశాఖపరిధిలో ఉండే ఏ ఆలయంలోనైనా ఆలయ అధికారులకు సిబ్బందికి తెలియకుండా ఎలాంటి కార్యక్రమాలు జరగవు. కానీ ప్రొద్దుటూరు రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వర ఆలయంలో మాత్రం ఉత్సవ కమిటీల పేర రకరకాల ప్రైవేటు కమిటీలు ఉన్నాయి. ఈ కమిటీలు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి (2019 నుంచి) వచ్చాక అధిక మయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో ఏర్పడిన పాలక మండలి కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇంకా కొనసాగుతోంది. ఈ ఉత్సవ కమిటీలు భక్తుల నుంచి ప్రతి పర్వదినానికి చందాల రూపంలో లక్షలు వసూళ్లు చేపడతాయి. బ్రహ్మోత్సవాల పేరిట రసీదులు కొట్టించి డబ్బులు రాబడుతున్నారు. వస్తు రూపేణ కూడా రాబడతారు. కానీ ఇవేవి దేవాలయ ఆదాయంలో జమా ఖర్చులుగా నమోదు కావు. కార్తీకమాసం, సంక్రాంతి పారువేటకు, మహాశివరాత్రికి, ఉగాదికి బ్రహ్మోత్సవాలకు, శ్రీరామనవమికి, దసరాకు, ప్రతి పౌర్ణమికి కూడా ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించి ఆదాయ వనరులుగా మార్చుకున్నారని ఆరోపణలున్నాయి.



సైకతలింగాకారంలో దర్శనమిస్తున్న పరమేశ్వరుడు



కార్తీక మాసోత్సవసేవ పేరుతో చందా రసీదులు

ప్రైవేటు కాలేజీ లెక్చరర్‌గా ఉన్న వ్యక్తికి చైర్మన్ బాధ్యతలు

గత వైసీపీ ప్రభుత్వంలో రామేశ్వరానికి చెందిన ప్రైవేటు లెక్చరర్‌గా పనిచేస్తున్న వ్యక్తిని ముక్తిరామిలింగేశ్వర ఆలయానికి చైర్మన్‌గా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అవుతున్నా అతనే చైర్మన్‌గా కొనసాగుతున్నాడు. ఇతని హయాం నుంచే ప్రైవేటు కమిటీలు పెట్టి చందాల పేర గత ఐదేళ్లకాలంలో భారీగా అక్రమ వసూళ్లు చేశాడని ఆరోపణలున్నాయి. ఆలయ వైదిక నియమాలకు విరుద్ధంగా చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి వ్యవహరిస్తారని చెబుతున్నారు. ఆఖరికి అమ్మవారి కానుకగా ఇచ్చిన చీరలు కూడా కైంక ర్యం అయ్యాయని చెబుతున్నారు. అతని పెత్తనంతో ఆలయ ఈవోల నుంచి ఇతర సిబ్బంది నలిగిపోతున్నట్లు చెబుతున్నారు. ఈవో కార్యాలయంలోని అన్ని రికార్డులు అతని కన్నుసన్నుల్లోనే ఉంటాయని వెల్లడిస్తున్నారు. అతన్ని ధిక్కరిస్తే వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడి ఇబ్బందులకు గురిచేస్తారని ఆరోపణలున్నాయి. కాగా, ఆలయంలో ప్రైవేటు కమిటీల అక్రమవసూళ్లపై అప్పటి ఈవో రామచంద్రాచార్యులు తీవ్రంగా అభ్యంతరం తెలిపి, బహిరంగంగా నోటీసులు కూడా జారీ చేశాడు. దీంతో ఆయనను ఉద్దేశ్యపూర్వకంగా వైసీపీ ప్రభుత్వంలో సస్పెండ్ చేయించారని సిబ్బం దే చెబుతున్నారు. ఆ తరువాత వచ్చిన ఈవోలంతా ఈ కమిటీల పెత్తనానికి తలొగ్గి దేవుడి సొమ్మును తిలాపాపం తలాపిడికెడు అన్నచందంగా పంచుకుంటున్నారు.

భక్తుల నుంచి నిలువు దోపిడీ

ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఆలయం కావడం వలన ఈ ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున వస్తారు. భక్తులనుంచి దేవునికి అలంకారసేవ, ప్రసాదసేవ, అన్నదాన సేవ, వస్త్రదాన సేవ, అభిషేకం సేవ హోమం సేవ, కుంకుమార్చన లాంటివి చేపడతారు. భక్తులను బట్టి రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు డబ్బులు రాబడతారు. వీటికి రసీదులు ఉండవు. దేవాలయ పాలకమండలి కమిటీ చైర్మన్‌గా చెప్పబడే వ్యక్తి అధికారికంగా వసూళ్లు చేస్తూ ఆలయం ఖాతాలో జమ చేయరని చెబుతున్నారు. ఈ డబ్బులన్ని ఆలయ ఉత్సవాలకు ఖర్చు పెట్టామని దొంగలెక్కలన్నీ ఉత్సవ కమిటీ సమావేశంలో చెబుతారని బహిరంగ ప్రచారం సాగుతోంది.

రాజీనామా చేసినా.. అతనిదే పెత్తనం

ముక్తిరామలింగేశ్వర ఆలయం ట్రస్టు బోర్డు చైర్మన్‌గా ఉన్న వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగం వచ్చి బద్వేలులో లెక్చరర్‌గా విధుల్లో చేరాడు. టెక్నికల్‌గా ట్రస్టుబోర్డు చైర్మనుకు అక్టోబరు 9వ తేదీ ఆయన రాజీనామ చేశారని ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు. కానీ అక్టోబరు 27న ప్రారంభమైన కార్తీక మాసోత్సవాలు రాజీనామా చేసిన చైర్మన్ ఆధ్వర్యంలోనే జరిగాయి. మొదటి సోమవారం ఆలయ ఈవో గానీ, ఇన్‌స్పెక్టర్ గానీ దేవాలయంలోకి అడుగు పెట్టలేదని చెబుతున్నారు. అన్ని అతనే నిర్వహించాడు. కార్తీక మాసోత్సవం పేరిట ఈ సంవత్సరం కూడా చందాలు రాబట్టి రసీదులు ఇస్తున్నారు. ఇందులో ఎక్కడా ఆలయ అధికారులు నేరుగా కనపడరు. దీన్నిబట్టి ఆలయంలో దేవుడిపేర వసూళ్లు చేసే ప్రతి పైసా ఆలయం ఖజానాలో జమకాకుండా అక్రమార్కుల జేబుల్లోకి వెళుతోంది. ఇందులో దేవాదాయశాఖ ఈవో నుంచి ఏసీ, డీసీల వరకు అందరి పాత్రవుందని, అందుకే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని భక్తులు వాపోతున్నారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం

కార్తీక మాసోత్సవసేవ పేరిట ముక్తిరామలింగేశ్వర ఆలయంలోని ప్రైవేటు కమిటీలు అక్టోబరు నెలలో భారీగా చందాలు వసూళ్లు చేసినట్లు వచ్చిన ఆరోపణలపై విచారించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఈ చందాల వసూళ్లకు దేవాదాయశాఖకు ఎటువంటి సంబంధంలేదు. దేవాదాయశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా భక్తులు, ప్రజలనుంచి చందాల పేరుతో డబ్బులు వసూళ్లు చేయరాదు. అలా ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీసే వారిని ఉపేక్షించం.

- శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయం, ప్రొద్దుటూరు.

దేశ సమైక్యత, సంస్కృతి కాపాడాలి

● వేమన బోధనలు మార్గదర్శకాలు ● మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు





కార్యక్రమానికి హాజరైన వారు, మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యత, సంస్కృతి, విలువలను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. రెండు రోజుల కడప జిల్లా పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం యోగి వేమన విశ్వవిద్యాలయంలో జరిగిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ నూతన పరిపాలన భవనంలోని అన్నమయ్య సెనేట్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. విద్యార్థులతో ముచ్చటించిన వెంకయ్యనాయుడు భారత ఔన్నత్యం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గొప్పదనం, తెలుగుభాష తీయదనం, కడప జిల్లా కళా-సాహిత్య విశిష్టతలను వివరించారు. మన మహనీయులు, ముఖ్యంగా నవ భారత నిర్మాత సర్దార్ వల్లభాయ్‌పటేల్ వంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. యువత దేశాభివృద్ధికి కార్యోన్ముఖులుగా మారాలని, వ్యక్తిత్వ వికాసానికి యోగివేమన బోధనలు మార్గదర్శకాలని చెప్పారు. సరళమైన పదాలతో పద్యాల రూపంలో వేమన బోధించిన జీవిత సత్యాలను ఆకళింపు చేసుకుంటే ఉన్నతమైన వ్యక్తిత్వం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. యువత మాతృభాష, భారతీయ సంస్కృతికి ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. గురువులను గౌరవించాలని, పెద్దల పట్ల వినయం ప్రదర్శించాలని, తోటి వారితో సఖ్యతతో మెలగాలని సూచించారు. అలాగే యువత సృజనాత్మక శక్తిని ఎప్పటికీ కోల్పోకూడదని, టెక్నాలజీని పరిమితస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దేశ బలోపేతానికి యువ త కీలక పాత్ర పోషించాలని సూచించారు. విద్యతో పాటు యోగా, క్రీడలు, కళలు, సాహి త్యం, మానసిక వికాసం మీద దృష్టిపెట్టాలన్నారు. సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని హితవుపలికారు. మన కట్టు బొట్టు, సంస్కృతి, సంప్రదాయాలు, వేషాభాషలు మన అస్తిత్వానికి ప్రతీకలని.. వాటిని కాపాడుకోవాలని సూచించారు. మాటతీరు, మర్యాద, పెద్దలంటే గౌరవం, ఆరోగ్యకరమైన భారతీయ ఆహారపు అలవాట్లు మన సంస్కృతిలో అంతర్భాగమని గుర్తుచేశారు. కుటుం బ వ్యవస్థను బలపరచుకోవాలని, తల్లిదండ్రులతో సమయాన్ని గడపాలని, ప్రేమ, అనురాగ బంధాలను పెంపొందించుకోవాలని పిలుపు నిచ్చారు. సమాజంలో స్నేహ భావం పెంపొందించాలని, ఈర్ష్య-ద్వేషాలను పక్కనపెట్టి ఆప్యాయతతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరు కూరి, వైవీయూ వీసీ బెల్లంకొండ రాజశేఖర్, రిజిస్ట్రార్ పద్మ, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీఓ జాన్ ఇర్విన్, యూనివర్సిటీ ఆచార్యులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, శ్రీశైలం దేవస్థానం చైర్మన్ రమేష్‌నాయుడు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ రమేష్‌నాయుడు, సీనియర్ నాయకులు శశిభూషణ్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

దేవునికడప శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

కడప కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలి గడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడప లో వెలసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం సాయంత్రం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకటజ్యోతిర్మయి ప్రతాప్ దర్శించారు. ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తికి అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి శ్రీవారిని దర్శించుకుని.. కార్తీకమాస దీపాల ను వెలిగించి ప్రత్యే క పూజలు నిర్వహించారు.



అనంతరం సమీప దేవుని కడప శివాలయంలో పరమ శివుని దర్శించుకుని పూజలు చేశారు. న్యాయమూర్తి వెంట ఇన్‌చార్జ్ జిల్లా జడ్జి రమేష్‌కుమార్, ఇతర జడ్జిలు ప్రవీణ్‌కుమార్, ప్రత్యూష, ఈశ్వర్ దేవాంగ్ తదితరులు ఉన్నారు.

ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి

2.40 లక్షల పింఛన్లు పంపిణీ

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సామాజిక భద్రతలో భాగంగా జిల్లాలో 2 లక్షలా 40వేల 635 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేసి 93.90 శాతం ప్రగతిని సాధించారు. 2,56,260 మందికి పింఛన్లు మంజూరు కాగా రూ.111 కోట్ల 51 లక్షలా 80వేలు నిధులు విడుదలయ్యాయి. ఇందులో 2 లక్షలా 40వేల 635 మందికి రూ.104 కోట్ల 33 లక్షలా 73వేల 500 పంపిణీ చేశారు. ఇందులో పులివెందుల మున్సిపాలిటీ ప్రథమస్థానంలో నిలవగా కలసపాడు మండలం చివరి స్థానంలో నిలిచింది.



అంగన్వాడీ కేంద్రం వద్ద పింఛన్ల పంపిణీ

పింఛన్ల కోసం నిరీక్షణ

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కొన్ని చోట్ల సిబ్బంది తీరుతో క్షేత్రస్థాయిలో సక్రమంగా జరగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మండల కేంద్రమైన వల్లూరులోని ఎస్సీ కాలనీలో పింఛన్ల డబ్బుల కోసం లబ్ధిదారులు ఉదయం నుంచి వేచి చూడాల్సిన పరిస్థితి. ఉదయం 7.30 తరువాత పింఛన్లు పంపిణీ చేసేందుకు సిబ్బంది వచ్చినప్పటికీ ఒకేచోట గుంపుగా చేర్చి పింఛన్ల పంపిణీ చేపట్టారు. దీనిపై ఆంధ్రజ్యోతి ఆరా తీయగా సాంకేతిక సమస్యల కారణంగా ఈ పరిస్థితి ఉందని వారు తెలిపారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లగా అలాంటిదేమీ లేదని, పింఛనుదారుల ఇళ్ల వద్దకే సొమ్ము చేర్చేందుకు చర్యలు చేపడుతున్నామంటూ చెప్పారు.

రూ.13లక్షలతో సచివాలయ ఉద్యోగి పరార్

సింహాద్రిపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాళమ్మగూడూరు సచి వాలయంలో విధులు నిర్వహిస్తున్న విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంటు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి రూ.13లక్షలతో పరారైనట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. పెన్షన్‌ల పంపిణీకి సంబంధించి రూ.6లక్షల ఇరవై ఐదువేలు డబ్బులు తీసుకెళ్లినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశారన్నారు. అలాగే సబ్సిడీ శనగ విత్తనాలకు సంబంధించి రైతులు చెల్లించిన రూ.7లక్షల ఇరవై ఐదు వేలు తీసుకెళ్లాడని.. అలాగే ఎరువులకు సంబంధించిన డబ్బులు తీసుకెళ్లాడని, ఎంత మొత్తం అనే వివరాలు సేకరిస్తున్నామని మండల ఇన్ చార్జ్ వ్యవసాయాధికారి రామాంజులరెడ్డి తెలిపారు. ఉద్యానవన శాఖలో విధులు నిర్వహించే అతని వివరాలపై ఆశాఖ ద్వారా ఆరా తీస్తున్నట్లు ఏఓ రామాంజులురెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

బార్‌లో.. యువతులు!

● ప్రొద్దుటూరులో కొత్త ఒరవడికి శ్రీకారం
● అనుమతులు లేవంటున్న ఎక్సైజ్ అధికారులు
● పట్టించుకోని బార్ యజమానులు

ప్రొద్దుటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముంబాయి, హైదరాబాద్, బెంగుళూరు చెన్నై, గోవాలో మాదిరి ప్రొద్దుటూరులో కొందరు బార్ యజమానులు కొత్తవరడికి శ్రీకారం చుట్టారు. బార్‌లలో యువతులతో మందు సరఫరా చేయిస్తున్నారు. ఇటీవల ప్రొద్దు టూరు వినాయకనగర్‌లో కొత్తగా ప్రారంభమైన ఒక బార్‌లో యువతులతో ఈతతంగం నడిపిస్తున్నారు. యువకులను ఆకర్షించడానికి బార్ యాజమాన్యం ఈ తరహా ట్రెండ్‌ను సెట్ చేసింది. ఇప్పటి వరకు ఫైవ్ స్టార్ హోటల్స్‌లో యువతులను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి ఫుడ్ సప్లయికి వినియోగిస్తున్నారు. ఇక ఇప్పుడు కాలేజీ రోడ్డు, వినాయక నగర్‌లను కలుపుకొని నివాసాల మధ్య ఫుడ్ కోర్టు ఏర్పాటు చేశారు. కాలేజీ రోడ్డు, నాలుగు రోడ్ల సర్కిల్ దగ్గరే మద్యం షాపు ఏర్పాటు చేయడంతో తాగుబోతులతో ఇప్పటికే ఆప్రాంత వాసులు, ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. వైన్స్ షాపుల్లోనే పర్మిట్ రూములు ఇవ్వడంతో అక్కడే మద్యం తాగి రోడ్లమీద పడి న్యూసెన్స్ చేస్తున్నారు. దీనికి తోడు వైన్స్‌షాపు ఎదురుగా ఫుడ్ కోర్టును ఇటీవల ఏర్పాటు చేశారు. ఫుడ్ కోర్టుకే బార్ అనుమతి తెచ్చుకొని అక్కడ అమ్మాయిలతో మందు సప్లయి చేయిస్తుండటంతో కొందరు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ పరిణామం ఎక్కడికి దారి తీస్తుందో చెప్పలేమని వాపోతున్నారు. దీనిపై ఎక్సైజ్ సీఐ సీవీ సురేంద్రారెడ్డిని వివరణ కోరగా... బార్‌లో అమ్మా యిలు మందు సరఫరా చేయడానికి అనుమతి లేదన్నారు. అలా ఎవరైనా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బార్‌లో మద్యం సప్లయి చేస్తున్న యువతి



బార్‌లో యూనిఫాంలో వున్న యువతి

వెంకయ్యనాయుడుకు ఘన స్వాగతం



వెంకయ్యనాయుడుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా శనివారం మధ్యాహ్నం కడప విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు ఘనస్వాగతం లభించింది. కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్, యోగివేమన విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్, కడప ఆర్డీఓ జాన్ ఎర్విన్ స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్న మాజీ ఉపరాష్ట్రపతికి జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు తదితరులు స్వాగతం పలికారు. అలాగే శ్రీశైలం దేవస్థానం ఆలయ చైర్మన్ రమేష్ నాయుడు, జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ రమేష్‌నాయుడు, సీనియర్ నాయకులు శశిభూషణ్‌రెడ్డి, భారవి, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, పలువురు బీజేపీ నాయకులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.



వెంకయ్యనాయుడుకు స్వాగతం పలుకుతున్న ఎస్పీ

ప్రమాదం కనిపిస్తున్నా పట్టించుకోరా..?

ప్రమాదం జరిగి పలువురు గాయపడినా అధికారుల్లో చలనం లేదు. సిద్దవటం మండలంలో భాకరాపేట నుంచి బెటాలియన్ వెళ్లే మార్గంలో ఉన్న వంతెన అత్యంత ప్రమాదకరంగా ఉంది. మోరీ ఇరువైపులా రక్షణ గోడ లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గతంలో ఆర్టీసీ బస్సు బోల్తా పడిన ఘటనలో ప్రయాణికులు గాయపడ్డ విషయం తెలిసిందే. మోరీకి ఇరువైపులా కాగితాలతో మాత్రమే కంచె వేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులు సకాలంలో స్పందించి మోరీకి రక్షణగోడ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



రక్షణ గోడలేకపోవడంతో ప్రమాదకరంగా ఉన్న వంతెన

హైకోర్టు న్యాయమూర్తికి ఎస్పీ స్వాగతం



కడప క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో రాష్ట్ర హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపను ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి

సిద్దవటం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాచుపల్లె, ఖాజీపల్లె గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేసింది. ఈ చెక్కులను టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షుడు రెడ్డప్ప గారి శ్రీనివాసరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ప్రజల కష్టాల్లో అండగా నిలిచి తక్షణ సాయం అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి, శ్రీనివాసుల రెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, సత్య చిట్‌ఫండ్ ఎండీ బాలక్రిష్ణారెడ్డి, మాచుపల్లె ఓబుల్‌రెడ్డి, కాజీపల్లె కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్స్ నూతన కమిటీ ఎన్నిక



ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు నూతన కమిటీ సభ్యులు

పెనగలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఐసీడీఎస్ చిత్తూరు ప్రాజెక్టు నూతన కమిటీ శనివారం బెస్తపల్లె అంగన్వాడీ కేంద్రంలో ఎన్నికైంది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన ఎన్నికలు జరిగాయి. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు, వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. చిట్వేలి ప్రాజెక్టు అధ్యక్షురాలిగా అన్నపూర్ణమ్మ, ప్రధాన కార్యదర్శిగా వసంత, కోశాధికారిగా ఉమామహేశ్వరి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుధామణి, సహాయ కార్యదర్శిగా సుజాత, ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు తెలిపారు. పెనగలూరు, చిట్వేలి మండలాల అంగన్వాడీ వర్కర్‌లు, సహాయకులు హాజరయ్యారు.

సమస్యల పరిష్కారానికి వినతి

సుండుపల్లె, నవంబరు1(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలోని పలు ప్రధాన సమస్యల పరిష్కారానికి అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేసినట్లు జనసేన నేత రామా శ్రీనివాస్ శనివారం తెలిపారు. పింఛా ప్రాజెక్టు దిగువ భాగంలో రాచపల్లి దిగువ పింఛా నదిపై, రాయవరం దిగువ భాగాన బాహుదా నదిపై హైలెవల్ వంతెనలు నిర్మించాలని కోరారు. అలాగే ముడుంపాడు కాజ్‌వేపై రక్షణ గోడ నిర్మించాలని, సుండుపల్లె రాయచోటి డబుల్ రోడ్డు పనులు సత్వరం ప్రారంభించి పూర్తి చేయాలన్నారు.

అలాగే రాయచోటి- రాజంపేట రహదారి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయని, సుండుపల్లె నుంచి రాజంపేటకు రెండు వరుసల రహదారి నిర్మించాలని కోరారు. అగ్రహారం నుండి సామిసేని గడ్డ వరకు 5 పల్లెలకు వెళ్లే రహదారి గుంతల మయంగా మారి రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు గతంలో వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వాటర్ ఫిల్టర్ వితరణ

రాజంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి దేవస్థానానికి శ్రీకృష్ణ అన్నదాన ట్రస్టు(కువైట్) అధ్యక్షుడు ఇండ్లూరు వజ్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చేజర్ల రామకృష్ణమరాజు, కార్యదర్శి రమణయ్య, ఉప కార్యదర్శి నాగేశ్వరరావునాయుడు, కోశాధికారి గడ్డం వీరనారాయణరావునాయుడు రూ.55 వేలు విలువ చేసే ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్‌ను శనివారం అందజేశారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డయాలసిస్ రోగికి పింఛను పంపిణీ

గాలివీడు, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరాన్ చెరువు పంచాయతీ శ్రీనివాసపురానికి చెందిన తమ్మిశెట్టి చంద్రయ్య అనే డయాలసిస్ రోగికి శనివారం గ్రామ పంచాయతీ కార్యదర్శి సరోజమ్మ రూ.10,200 ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను పంపిణీ చేశారు. ఐదు నెలలుగా తనకు రాయచోటి ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ చేస్తున్నారని, అయితే ఇంతవరకు పింఛన్ రాలేదని మంత్రికి వివరించారు. ఇందుకు స్పందించిన మంత్రి బాధితుని సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు.

రచయితల మహాసభకు రండి

కడప కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు విచ్చేసిన వెంకయ్యనాయుడును శనివారం స్థానిక స్టేట్ గెస్ట్‌హౌస్‌లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి కలిసి వచ్చే 2026 సంవత్సరంలో కడపలో రాష్ట్ర స్థాయిలో జరుగనున్న రచయితల మహాసభకు తప్పక హాజరుకావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పి. నాగరాజు, పి. నీలవేణి, వి. వెంకటేశ్వరరాచారి పాల్గొన్నారు. అనంతరం వెంకయ్యనాయుడును సత్కరించారు.



సాహిత్యరత్న దివంగత పాలాది లక్ష్మీకాంతం శ్రేష్ఠి రచించిన వివిధ పుస్తకాలను వెంకయ్యనాయుడుకు బహూకరిస్తున్న వాసవీ గ్రాఫిక్స్ పీవీ రమేశ్



వెంకయ్యనాయుడును సన్మానిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, బీజేపీ నాయకుడు శశిభూషణ్‌రెడ్డి

నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక

రాజంపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం కొత్త బోయనపల్లె ఎస్‌జేఎస్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.రెడ్డి సాయి రాజ్యాంగ దినోత్సవం వ్యాసరచన, క్విజ్ పోటీల్లో పాల్గొని నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యాడు. శనివారం రాజంపేట బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసెంబ్లి నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఈ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థి సి.రెడ్డిసాయి నియోజకవర్గస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.భారతి తదితరులు అభినందించారు.

పేదలకు పింఛనుతో భరోసా

చెన్నూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో అర్హులైన వారికి పింఛన్ల ద్వారా భరోసా కల్పించడం జరుగుతుందని మండల టీడీపీ కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండల వ్యాప్తంగా శనివారం పేదలకు అందిస్తున్న పింఛను కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అలాగే పలువురికి పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పాలనలో కన్నా మెరుగ్గా పింఛన్లను ఎన్నికల హామీలో చెప్పిన విధంగా పెంచి అందిస్తున్నామని, ఆ ఘనత చంద్రబాబుదే అన్నారు. అర్హులైన వారు ఎవరైనా సరే దరఖాస్తు చేసుకుంటే పింఛన్లు మంజూరు కాగానే వారికి అందిస్తామని తెలిపారు. అలాగే ఉదయం 4గంటల నుంచే వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ఇతర సచివాలయ సిబ్బంది పింఛనుదారులు ఇళ్ల వద్దకు వెళ్లి వారికి అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు పంచాయతీ అధికారి రామసుబ్బారెడ్డి, టీడీపీ నేతలు చెన్నయ్య, మాజీ జడ్పీటీసీ చిన్నయ్య, డిస్ట్రిబ్యూటరీ కమిటి చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర అటవీశాఖ మాజీ డైరెక్టరు రామన శ్రీలక్ష్మి, వేల్పుల సుబ్రహ్మణ్యం, మన్నూరు అక్బర్, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, ఆర్.సుధాకర్‌రెడ్డి, సంజీవపవన్, బెస్త కార్పొరేషన్ డైరెక్టరు మల్లె సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థల పనితీరుపై అవగాహన అవసరం

సిద్దవటం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలైన పంచాయతీలు, మండల పరిషత్తు పని తీరును విద్యార్థులు తప్పనిసరిగా తెలుసుకోవాలని సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.సునీత అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు దేశానికి పట్టుకొమ్మలని, వాటి నిర్మాణం, విధుల గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. ప్రతి పల్లెలో పారిశుద్ధ్యం, నీటి సరఫరా, 15వ ఆర్థిక సంఘం నిధులు, జనన, మరణ ధ్రువపత్రాలు, రేషన్‌కార్డులు తదితర వాటిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా సైన్సు ఉపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల పనితీరు మెరుగుపరచడానికి విద్యార్థుల ఆలోచనలు కూడా ఉపయోగపడతాయన్నారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

ధర్మవరంరూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): శ్రీసత్య సాయి జిల్లా ధర్మవరం రూరల్ మండలంలోని పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలను శనివారం ఆయన స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల చిగిచెర్ల గ్రామంలో వీరముద్దప్ప గుడి, గొట్లూరులో మహంకాళమ్మ, పెద్దమ్మగుడి, రాంపురంలోని సత్యమ్మ ఆలయాల్లో జరిగిన చోరీలపై కేసులు నమోదు చేశామన్నారు. వీటిపై పలు కోణాల్లో విచారణ చేసి నిందితులను గుర్తించామన్నారు. ఈ క్రమంలో అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన గురునాథం అంజయ్య, గురునాథం ఆంజనేయులు, కర్ణాటక రాష్ట్రం పావగడ తాలుకా ఎగువపల్లికి చెందిన గురునాథం వెంకటేశ్వర్లు చోరీలు చేసినట్లు నిర్ధారించుకుని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 30 వెండి గొడుగులు, (340గ్రాములు) మూడు గ్రాముల బంగారం తాళిబొట్లు రెండు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముగ్గురు ఊరు చివరన ఉన్న ఆలయాలపై రెక్కీ నిర్వహించి, రాత్రి పూట చోరీలకు పాల్పడేవారని తెలిపారు.



పట్టుబడిన దొంగలు, చోరీ సొత్తును చూపుతున్న ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది



● భార్యాభర్త మధ్య జరిగిన చిన్న గొడవపై నాన్నమ్మ మందలించిందని ఇటీవల కడప నగరం శంకరాపురానికి చెందిన భార్యభర్త తమ ఏడాదిన్నర చిన్నారితో సహా రైలు పట్టాలపై పడి ప్రాణాలు కోల్పోయారు.

● అదే రోజు ఆర్థిక పరిస్థితులు తట్టుకోలేక కడప నగర శివార్లలో మరో యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

● అనారోగ్య సమస్యల కారణంగా ఓ ఏఎస్ఐ కనుమలోపల్లి వద్ద, ఒక లారీ డ్రైవర్ కొండాపురం వద్ద రైలు కింద పడ్డారు.

● ప్రేమించిన అమ్మాయితో పెళ్లి చేయలేదంటూ తీవ్ర మనోవేదనకు గురైన ప్రొద్దుటూరుకు చెందిన ఓ యువకుడు రైలు కింద పడి ప్రాణాలు కోల్పోయాడు.

కారణం ఏదైనా వీరి మృతి.. వారి కుటుంబాలకు కడుపుకోత మిగుల్చుతుందే తప్ప పరిష్కారం చూపలేదు. ఈ చిన్న లాజిక్‌ను గ్రహించలేక, క్షణం ఆలోచించక తొందరపాటు నిర్ణయాలు తీసుకుని ఉసురు తీసుకుంటున్నారు. దీంతో రైల్వేట్రాక్‌లు సూసైడ్ స్పాట్‌గా మారుతున్నాయి. ఇనుప కమ్మీలపై రక్తపు మరకలు అంటుతున్నాయి. క్షణంలో వచ్చే చావు కంటే రైలు చక్రాల కింద తనువు అనుభవించే నరకం వర్ణనాతీతం.





రైల్వేట్రాక్‌లపై మృత్యుఘోష

● కుటుంబ కలహాలతో కొందరైతే.. అనారోగ్యం, ఆర్థికం, ప్రేమ వ్యవహారాలతో ఇంకొందరు

● పరిష్కారం లేదని చావును ఆశ్రయిస్తున్న పిరికి మనసులు

కడప క్రైం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు పట్టాలు దాటే క్రమంలో కొందరైతే, ఆర్థిక పరిస్థితులు, కుటుంబ కలహాలు.. ప్రేమ, అనారోగ్య సమస్యలతో ఇంకొందరు రైలు కిందపడి ప్రాణాలు విడుస్తున్నారు. ఇలా నిత్యం ఏదొక రూపంలో రైలు పట్టాలపై మృత్యుఘోష వినిపిస్తోంది. సమస్యలకు పరిష్కారమే లేదని నిండు ప్రాణాలు రైలు చక్రాల కింద నలుగుతున్నాయి. ఈక్రమంలో చనిపోయిన వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోతే ఆ కుటుంబ సభ్యులకు కడచూపు కూడా ఉండదు. ఇది ఎంతో బాధాకరం. కడప నుండి ఎర్రగుంట్ల, ఎర్రగుంట్ల నుండి జమ్మలమడుగు, కడప నుండి నందలూరు వరకు నిత్యం రైళ్ల రాకపోకలు వస్తుంటాయి. కడప పరిధిలో చాలావరకు రైలు మార్గం అడవుల గుండా ఉండటంతో రైల్వే అధికారులు సంఘనాస్థలానికి చేరుకోవడం కష్టతరంగా కూడా ఉంది.

కొన ఊపిరితో ఉన్నా కాపాడలేరు..

ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగితే నిమిషాల్లో పోలీసులకు కానీ, 108కు సమాచారం అందించి వారిని రక్షించే అవకాశం ఉంటుంది. కానీ రైలు పట్టాలపై జరిగే ఘటనలు చాలా వరకు ఎవరికీ కనిపించవు. ఎవరైనా రైలు కింద పడి తీవ్ర గాయాలపాలైనా కనీసం వారిని గుర్తించే అవకాశాలు కూడా ఉండవు. చివరికి కొన ఊపిరితో ఉన్నా రక్షించేవాడు లేక కొట్టుమిట్టాడుతూ ప్రాణాలు విడవాల్సిందే.

గుర్తించడం పోలీసులకు కూడా కష్టమే..

రైలు ట్రాక్‌లపై చాలావరకు మృతదేహాలు గుర్తుపట్టలేనంత స్థితిలో కనిపిస్తుంటాయి. రైలు వేగంగా ఢీకొనడం, ఇనుప కమ్మీలు కావడంతో ప్రమాదం జరిగిన గంటల్లోనే మృతదేహం నల్లగా మారిపోతుంది. కొన్ని మృతదేహాలు తునకలుగా, ఇంకొన్ని ముఖం కనిపించకుండా, భయంకర స్థితిలో ఉంటాయి. ఇలాంటప్పుడు మృతుల వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేకుంటే పోలీసులకు కూడా కష్టతరంగా ఉంటుంది. ఈ మృతదేహాలను సేకరించి మార్చురీలో భద్రపరచడంతో పాటు మృతికి సంబంధించిన వివరాలు మీడియా లేక వాల్‌పోస్టర్లతో పాటు ఇతర పోలీసుస్టేషన్లకు పంపించి ఆచూకీ కోసం ఎదురు చూడాల్సిందే. మృతదేహాలను రెండురోజుల్లో గుర్తించలేకపోతే కడప కార్పొరేషన్, మున్సిపాలిటీ, లేదా స్వచ్ఛంద సంస్థల ద్వారా అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తుంది.

బంగారు అభరణాల తయారీ దుకాణంలో చోరీ

● 20గ్రాముల బిస్కెట్, 30 గ్రాముల నల్లల దండ, 50వేల నగదు అపహరణ



సీసీ కెమెరాలో అనుమానుతుడి ఫొటో

ప్రొద్దుటూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శంకరయ్యగారి వీధిలో ఉన్న భారతీ కాంప్లెక్స్ రూమునెంబరు 5 బంగారు నగల తయారీ షాపులో శనివారం మధ్యాహ్నం భోజనానికి వెళ్లిన సమయంలో చోరీ జరిగింది. ఈ మేరకు దుకాణం యజమాని పోలంకి మహేష్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలంకి మహేష్(37) వారానికి 30 గ్రాముల బంగారం తెచ్చుకుని ఆభరణాలు తయారు చేసి జ్యువెలరీ షాపులకు వేసేవాడు. శనివారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళుతూ దుకాణ షట్టర్‌కు తాళాలు వేశాడు. కానీ తిరిగి వచ్చి చూసేసరికి దుకాణంలో వున్న 20 గ్రాముల గట్టుబంగారు బిట్టు, 30 గ్రాముల నల్లల దండ, 50 వేల నగదు మాయమయ్యాయి. సీసీ కెమెరాల్లో పరిశీలించగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి షట్టర్ తెరిచి దుకాణంలో వున్న బంగారాన్ని అపహరించినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

కలసపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ విద్యార్థిని పట్ల అనుచితంగా ప్రవర్తించిన మారె శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. రెండు రోజుల క్రితం తన తల్లితో కలిసి వెళుతున్న ఆ విద్యార్థినిని శ్రీను తన బైక్‌లో ఎక్కించుకొని వెళ్తూ మార్గమధ్యలో అసభ్యకరంగా ప్రవర్తించాడని, బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బాలికలు, మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ తెలిపారు.

మైదుకూరులో 269 మందిపై కేసులు నమోదు

మైదుకూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఆరు నెలల కాలంలో మద్యం తాగి మోటారు వాహనాలు నడుపుతున్న 107 మందిపై, అలాగే బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగి ప్రజాశాంతికి భంగం కలిగించిన 167 మందిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచామని అర్బన్ సీఐ రమణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ యువత మద్యం తాగడం వల్ల ప్రమాదాలకు గురి కావడమే గాక ఎదుటి వారిని కూడా ప్రమాదాలకు గురి చేస్తున్నారని తెలిపారు. ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గండికోట నుంచి 2000 క్యూసెక్కులు విడుదల

కొండాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి శనివారం మధ్యాహ్నం నుంచి 2000క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 3400 క్యూసెక్కులు, చాగల్లు రిజర్వాయర్ నుంచి పెన్నానది ద్వారా 400 క్యూసెక్కులు, చిత్రావతి నది ద్వారా 100 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నట్లు ఈఈ తెలిపారు. కాగా తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు.కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.76 టీఎంసీ ల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

అరుణాచల గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

● ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకుని తమిళనాడులో ఉన్న తిరువణ్ణామలై (అరుణాచలం) గిరిప్రదక్షిణకు జిల్లా నుండి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ కడప రీజియన్‌లోని కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల డిపోల నుండి ఈనెల 4వ తేదీ మంగళవారం ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్తీక సోమవారాలలో, కార్తీక పౌర్ణమి రోజున తమిళనాడు రాష్ట్రంలో ఉన్న అరుణాచలంతో పాటు ప్రముఖ శైవ క్షేత్రాలైన శ్రీశైలం, పొలతల, నిత్యపూజకోన, శివాలయాలకు కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం అనువుగా ఉంటుందని, సీట్లు బుకింగ్ చేసుకుని అరుణాచల గిరిప్రదక్షిణను భక్తిశ్రద్ధలతో పూర్తిచేయాలని కోరారు. కడప డిపో నుండి తిరువణ్ణామలైకు టికెట్ ధర రూ.1044, బద్వేలు డిపో నుండి రూ.1282, మైదుకూరు డిపో నుండి రూ.1209, ప్రొద్దుటూరు డిపో నుండి రూ.1273, పులివెందుల డిపో నుండి రూ.1193, జమ్మలమడుగు డిపో నుండి రూ.1363 టికెట్ ధర ఉంటుందని ఆయన తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు అంకాళమ్మగూడూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

సింహాద్రిపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాళమ్మగూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు అరుణ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో అక్టోబరు 31న రాయచోటిలో జరిగిన జిల్లా స్థాయి బేస్ బాల్ పోటీలలో అండర్-14 విభాగంలో భానుకుమార్, సాఫ్ట్‌బాల్ పోటీలలో అండర్-17 విభాగంలో అరవిందనాథ రెడ్డి ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వీరు ఈనెలలో చిత్తూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థు ఎంపికైన విద్యార్థులను, పీడీ శిరీషను అభినందించారు.

వెంకయ్యకు ఉరుసు ఉత్సవాల ఆహ్వానం

కడప కల్చరల్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 5 నుండి 9వ తేదీ వరకూ జరుగనున్న పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలకు హాజరుకావాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడును పెద్దదర్గా శిష్యులు ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం స్థానిక స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఆయనను కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్‌రెడ్డి తదితరులున్నారు.

హాస్టల్‌పై అధికారుల విచారణ



పులివెందుల ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో విద్యార్థులను విచారిస్తున్న ఏబీసీడబ్ల్యూవో బి.జ్యోతి

పులివెందుల రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పులివెందులలోని గాయత్రినగర్‌లో ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో జరిగిన ఉదంతంపై శనివారం జిల్లా అధికారులు విచారణకు ఆదేశించారు. దీంతో శనివారం రాత్రి ఏబీసీడబ్ల్యూవో బి.జ్యోతి, ఇతర అధికారులతో కలిసి హాస్టల్‌లో జరుగుతున్న విషయాలపై విద్యార్థులను విచారించారు. హాస్టల్‌లో వార్డన్ సరిగా ఉండడం లేదని, మెనూ సక్రమంగా అందించడం లేదని విద్యార్థులు తెలిపారు. కేర్ కేటింగ్ లేదని, ట్యూటర్ లేరని, ఉదయం పూట టిఫెన్ తినాలంటే ఇబ్బందిగా ఉంటోందని, శుభ్రంగా ఉండడం లేదని రాతపూర్వకంగా వివరించారు. మరుగుదొడ్లు సరిగా మెయింటెన్ చేయకపోవడంతో బయటకు వెళ్లాల్సి వస్తోందని, ఏదైనా ఆరోగ్యం బాగలేకపోయి వార్డన్‌ను అడిగితే దుర్భాషలాడుతారని, నైట్ వాచ్‌మెన్ ముని తమను ఆసుపత్రికి తీసుకెళ్తాడన్నారు. తమకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని విద్యార్థులు కోరారు. అనంతరం వంట ఎందుకు సరిగా చేయడం లేదని వంట మనిషిని ప్రశ్నించారు. సమయానికి వండించడానికి సరుకులు రావడం లేదని, సరుకులు లేకపోతే పిల్లలకు ఎలా రుచిగా వండిపెట్టగలనని వంటమనిషి తెలిపారు. అనంతరం వార్డన్ మోహన్‌ను విచారించి రాతపూర్వకంగా తీసుకున్నామని, నివేదికను ఉన్నతాధికారులకు పంపించి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఏబీసీడబ్ల్యూవో బి.జ్యోతి ఆంధ్రజ్యోతికి వివరించారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

సీకేదిన్నె, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండి పంటల నష్ట నివారణపై శ్రద్ధ వహించాలని వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాను వలన కడప, అన్నమయ్య జిల్లాలో జరిగిన నష్టాలపై వ్యవసాయ డివిజన్ అధికారులు పంట నష్టం అంచనాలు చేయడంతో పాటు రైతులకు పంట నష్ట నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలన్నారు. ఇందుకు అవసరమైన సాంకేతిక సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ అంకయ్యకుమార్, డాట్ సెంటర్ కోఆర్డినేటర్ క్రిష్ణప్రియ, ఆత్మా పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ ఏడీఏలు రైతులకు పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీ డీడీఏ నాగరాజు, వివిధ డివిజన్ల ఏడీఏలు, శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, సుబ్రమణ్యం, మాధురి, శ్రీవల్లి, యాస్మిన్, తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో ఎన్నో ప్రయోజనాలు

వల్లూరు నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇంకుడు గుంతల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. మండలంలోని కొప్పోలు, తప్పెట్లలో నీటి యాజమాన్య సంస్థ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న హార్టికల్చర్ సోక్ పిట్స్, హౌస్ కంపోస్టు పిట్స్ ఇంటింటి సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హార్టికల్చర్ కింద చేపడుతున్న పండ్ల తోటల పెంపకం రైతులతో మాట్లాడారు. తప్పనిసరిగా మొక్కలు పెంచి లాభం పొందాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకుడుగుంతల్లో నీరు ఇంకి వీధులు జలమయం కాకుండా ఉపయోగపడతాయని తెలిపారు. ఈయన వెంట ఉపాధి సిబ్బంది ఉన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న పీడీ ఆదిశేషారెడ్డి

వ్యక్తిపై దాడి, కిడ్నాప్

● పలువురిపై కేసు నమోదు

పులివెందుల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన ప్రియాంత్‌రెడ్డిపై పులివెందులకు చెందిన యల్లారెడ్డి, అతని అనుచరులు కిడ్నాప్ చేసి దాడి చేశారు. దీనిపై పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు... హైదరాబాద్‌కు చెందిన ప్రియాంత్‌రెడ్డి చెక్‌బౌన్స్ కేసులో శనివారం పులివెందుల కోర్టుకు వచ్చారు. అనంతరం కారులో తిరిగివెళ్తుండగా పులివెందుల శివార్లలో యల్లారెడ్డి, అతని అనుచరులు కారును ధ్వంసం చేసి అతడిని కిడ్నాప్ చేసి ఓ తోటలోకి తీసుకెళ్లి దాడి చేశారని ప్రియాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ప్రియాంత్‌రెడ్డికి, యల్లారెడ్డికి గతంలో లావాదేవీలు ఉండేవి. ప్రియాంత్‌రెడ్డి డబ్బులు ఇవ్వకపోవడంతో యల్లారెడ్డి పులివెందుల కోర్టులో చెక్‌బౌన్స్ కేసు వేశారు. గతంలో యల్లారెడ్డిపై హైదరాబాద్‌లో కేసు పెట్టించారని, దాని పర్యవసానంగా పులివెందులలో తన అనుచరులతో దాడి చేసినట్లు ప్రియాంత్‌రెడ్డి పోలీసులకు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి

● జిల్లా ప్రకృతి వ్యవసాయం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి

లింగాల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి అన్నారు. మండలంలోని అక్కులగారిపల్లె గ్రామంలో రైతు ఉదయ్‌కృష్ణారెడ్డి ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. ఇందుకు అవసరమైన సహజ ఎరువులు, ద్రావణాలు, కషాయాలు, ఘన, ద్రవ జీవామృతాలు, పంచగవ్య మొక్కల పెరుగుదలకు కావాల్సిన ద్రావణాలు ఈ కేంద్రంలో లభిస్తాయని, రైతులు వీటిని ఉపయోగించుకుని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచు విజయభాస్కర్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ ఎంటీ భాస్కర్‌రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రకృతి వ్యవసాయం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి, తదితరులు

అనుమతి తీసుకున్న గదుల్లోనే ల్యాబ్

● సీఎన్ఆర్ నర్సింగ్‌హోం ల్యాబ్ సీజ్ : డీడీఎంహెచ్‌వో గీత



ల్యాబ్‌ను సీజ్ చేసిన వైద్యాధికారులు

ప్రొద్దుటూరు అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తున్న డాక్టర్లు అనుమతి తీసుకున్న గదుల్లోనే స్కానింగ్ మిషన్లను ఉంచాలని, ఇతర రూముల్లోకి మార్చకూడదని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత అన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలోని గాంధీరోడ్డులో ఉన్న సీఎన్ఆర్ నర్సింగ్‌హోం ఆసుపత్రిలోని ల్యాబ్‌ను శనివారం డీడీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో వైద్యాధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత నెలలో ఈ ఆస్పత్రి నుండి డాక్టర్ ప్రతాప్‌రెడ్డి ఆర్ఎంపీ కేంద్రానికి స్కానింగ్ మిషన్‌ను తరలించారని ఆధారాలతో ఫిర్యాదు అందిందని, ఈ మేరకు తనిఖీలు నిర్వహించి ఓపీ ల్యాబ్‌ను సీజ్ చేయడం జరిగిందన్నారు. అనుమతి తీసుకున్న చోటే ల్యాబ్ నిర్వహించాలని, అలాకాకుండా మార్చితే చట్టవ్యతిరేకం అవుతుందని, వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. లింగనిర్ధారణ నేరమని, చట్టవ్యతిరేక పనులు ఎవరు చేసినా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో డీఈఎంవో భారతి, దేవాంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దౌలా, ఎన్‌సీడీ డాక్టర్ ప్రవీణ్, హెల్త్ ఎడ్యుకేటర్ కుమారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

125 పరుగులకే కర్నూలు ఆలౌట్

● 100 పరుగుల వెనుకంజలో అనంతపురం జట్టు



6వికెట్లు సాధించిన రోహిత్‌రెడ్డి (అనంతపురం)

కడప స్పోర్ట్స్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-14 మెన్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా శనివారం రెండు వేర్వేరు జట్ల మధ్య సాగిన క్రికెట్ మ్యాచ్‌లలో కర్నూలు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 125 పరుగులకే ఆలౌట్ కాగా.. నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు 100 పరుగుల వెనుకంజలో వుంది.

ఏసీఏ క్రికెట్ మైదానంలో..

నగరంలోని రిమ్స్ సమీపంలో ఉన్న వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప, కర్నూలు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు 69.5 ఓవర్లలో కేవలం 125 పరుగులకు ఆలౌట్ అయింది. రిషిత్ 44 పరుగులు చేయగా కడప జట్టు బౌలర్ ముని జ్ఞానేశ్వర్ 4 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేసింది. ఇందులో అఫ్షాన్ 31 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. దీంతో కడప జట్టు మరో 57 పరుగుల వెనుకంజలో వుంది.

కేవోఆర్ఎం మైదానంలో..

నగర శివారు ప్రాంతంలోని కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు, అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి 58.5 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌట్ అయింది. కిన్నుకిశాల్ 48 పరుగులు చేశారు. కాగా బౌలింగ్ విభాగంలో అనంతపురం బౌలర్ రోహిత్‌రెడ్డి 6 వికెట్లు పడగొట్టడం విశేషం. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసింది. దీంతో అనంతపురం జట్టు మరో 100 పరుగుల వెనుకంజలో వుంది.

విద్యార్థులు నిజాయితీగా మెలగాలి

సీకేదిన్నె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిజాయితీగా మెలగాలని పవర్‌గ్రిడ్ మేనేజర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా జె.కొత్తపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పవర్‌గ్రిడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవినీతి నిరోధంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ రమేష్, జూనియర్ ఇంజనీరు సుదర్శన్‌రెడ్డి, హెచ్ఎం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను ఆపాలి

కమలాపురం రూరల్, నవంబరు 1 (ఆఆంధ్రజ్యోతి) :పేద ప్రజలను వైద్యసేవలకు దూరంగా చేసే వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వెంటనే విరమించుకోవాలని కమలాపురం వైసీపీ ఇన్‌ఛార్జ్ నరేన్ రామాంజుల రెడ్డి , వైసీపీ రాష్ట్ర ఎస్ఈసీ సభ్యుడు సత్యసాయినాథ్‌శర్మ తెలిపారు. వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాలకు ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

వేంపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచేందుకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ర్యాలీలు నిర్వహించడం, అక్కడి పాఠశాలల్లో విద్యార్థులకు ప్రస్తుతం సమాజంలో ఉన్న నూతనసాంకేతికతను, సామాజిక అంశాల గురించి తెలియపరిచారు. తాళ్లపల్లె, కుమ్మరాంపల్లె గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఏవో రవికుమార్, తిరుపతిరెడ్డి, దీప్తి,రత్నకుమారి, కోనప్ప ఆధ్వర్యంలో డిజిటల్ అవేర్‌నెస్, వాట్సప్ ఇ-గవర్నెన్స్, మత్తుపదార్థాల నిషేధం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

ఇడుపులపాయలో: ఇడుపులపాయ గ్రామంలో ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కోనప్ప ఆధ్వర్యంలో మనమిత్ర పై అవగాహన కల్పించారు. చదువురాని వారు కూడా వాయిస్‌ను ఉపయోగించి తెలుసుకోవచ్చన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆంజనేయస్వామి ఆలయ భూమి స్వాధీనం చేసుకుంటాం

జిల్లా ఎండోమెంటు అసిస్టెంటు కమిషనరు మల్లికార్జున ప్రసాద్

చెన్నూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులో ఉండే ఆంజనేయస్వామిగుడికి చెందిన భూమి కొత్తరోడ్డులో ఉందని దానిని కొందరు మాది అంటూ దౌర్జన్యంగా ఆక్రమించుకుని అనుభవించుకుంటున్నారని దానిని స్వాధీనం చేసుకుని చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా దేవదాయశాఖ అసిస్టెంటు కమిషనరు మల్లికార్జునప్రసాద్ అన్నారు. శనివారం చెన్నూరు ఎండోమెంటు కార్యాలయంలో గ్రామానికి చెందిన పెద్దలు, పలువురు రైతులు ఆయనను కలిసి మండల వ్యాప్తంగా ఆలయ భూములు ఆక్రమణకు గురయ్యారన్నారు. మండల కిసాన్‌మోర్చా రైతు నాయకుడు చదిపిరాళ్ల ప్రసాద్‌రెడ్డి. స్థానిక నాయకులు ఆవుల బసిరెడ్డి, గంగసాని శివారెడ్డితో పాటు ఇంకా పలువురు నాయకులు అక్రమార్కుల ఆగడాలకు కళ్లెం వేయాలని కోరారు. అలాగే చెన్నూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులోని నాగేశ్వరాలయంలో కార్తీక మాసం మూడో సోమవారం జరిగే ఊరేగింపునకు ఎలాంటి అడ్డంకి లేకుండా జరిగేందుకు ఎస్పీకి లేఖ రాస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంటు రాంప్రసాద్‌రెడ్డి, కల్లూరు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఈఎంఎస్ స్కీం పునరుద్ధరణ హర్షణీయం

కడప మారుతీనగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలోకి ఆర్టీసీ విలీనానంతరం నిలిపివేసిన రిటైర్డ్ ఎంప్లాయీస్ మెడికల్ స్కీమ్ (ఆర్ఈఎంఎస్) తిరిగి అమలుకు కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కె.కె. కుమార్, జోనల్ కార్యదర్శి రాజశేఖర్, జోనల్ వర్క్‌షాపు రీజనల్ సెక్రటరీ అంకిరెడ్డి పేర్కొన్నారు. ఆ మేరకు శనివారం స్థానిక ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

రేపు కలెక్టరేట్ వద్దకు రావాలి

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంఎస్ఎంఈల ద్వారా పరిశ్రమలు ఏర్పాటుచేసిన సబ్సిడీ రాని సబ్సిడీ రాని ఎస్సీ ఎస్టీలు 3వ తేదీన కడప కలెక్టరేట్ వద్దకు రావాలని శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ ద్వారా పరిశ్రమలు ఏర్పాటుచేసిన ఎస్సీఎస్టీలు 2021 ఆగస్టు నుంచి సబ్సిడీ రాలేదన్నారు. కాగా సోమవారం ఉదయం 10గంటలకు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వడంతో పాటు భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ ప్రకటించేందుకు ఎంఎస్ఎంఈలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ వేడుకలు

వేంపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నివాళులర్పించారు. అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చేసిన త్యాగాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆవోపా సలహాదారులు వెంకటేశ్వర్లు గుప్తా,జాయింట్ సెక్రటరీ శివకిరణ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు దారారాజా, కామిశెట్టి సురేష్ పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): టెట్ అమలులోకి రాకముందు నియామకమైన ఉపాధ్యాయులందరికీ టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. శనివారం కడప నగరం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కలిశారు. టెట్ పరీక్షలపై వివరించారు.

రాయలసీమ వర్క్‌షాప్‌ను జయప్రదం చేయండి

కడప నాగరాజుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో వక్ఫ్ బోర్డు ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయడం ఎలా అనే అంశంపై ఆదివారం వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని బోర్డు రాష్ట్ర నాయకులు రాయలసీమ బాధ్యులు ఇషాక్ అలీ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.వారు మాట్లాడుతూ కడప నగరంలోని సైనిక నగర్ వద్ద ఉన్న మసీదు ఉస్మాన్‌లో ఆదివారం ఉదయం 10గంటలకు వర్క్‌షాప్ ఉంటుందన్నారు.

ఉక్కు సాధనే లక్ష్యంగా పోరాటాలు సాగిద్దాం

కడప నాగరాజుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప ఉక్కు సాధనే లక్ష్యంగా పోరాటాలు సాగిద్దామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని శనివారం కడపనగరంలో నిహార్ స్కిల్ డెవలప్‌మెంట్ లో నిరుద్యోగులతో కలిసి డీవైఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సునీల్, యల్లయ్య, విజయ్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో పేద,మధ్యతరగతి వర్గాలకు నష్టం

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలకు ప్రైవేటీకరణ ద్వారా పేద మధ్యతరగతి వర్గాలకు తీవ్ర నష్టంవాటిల్లే అవకాశం ఉందని మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాష తెలిపారు. శనివారం కడపనగరం 28వ డివిజన్ శారద నిలయం హైస్కూల్ సమీపంలో కార్పొరేటర్ అరిఫుల్లా బాష ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీబలోపేతానికి కార్యకర్తలుకృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నార్త్‌జోన్ అధ్యక్షుడు బీహెచ్ ఇలియాస్, కార్పొరేటర్ అజ్మతుల్లాఖాన్, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా ఐఏఎస్‌ను నియమించాలి

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్


మాట్లాడుతున్న బాలిశెట్టి హరిప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే ఐఏఎస్ అధికారిని కమిషనర్‌గా నియమించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం మారినప్పటికీ వైసీపీ ప్రభావం ఇంకా కొనసాగుతున్నట్లే భావన కనిపిస్తోందన్నారు. ఇప్పుడిప్పుడే కార్పొరేషన్‌లో పాలన గాడిలో పడుతుందనుకుంటే అప్పుడే మార్పులా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. శనివారం కడప నగరం హరిటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీకి వీరవిధేయుడుగా ఉన్న మెప్మా పీడీ కిరణ్‌కుమార్‌ను కడప కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించాలనుకోవడం అవివేకమని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కిరణ్‌కుమార్ కరుడుగట్టిన వైసీపీ వాదిగా ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం కమిషనర్‌గా ఉన్న మనోజ్‌రెడ్డి అన్ని పార్టీలకు అనుకూలంగా ఉంటూ కడప అభివృద్ధికి ఎంతో సహకరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గోపిశెట్టి నాగరాజు, ప్రసాద్, దండు శివ తదితరులు పాల్గొన్నారు.

నీటిని, ఇంధనాన్ని వాడుకుందాం



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ యు.శ్రీనిత

పులివెందుల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నీటిని, ఇంధనాన్ని సమర్థవంతంగా వాడుకుంటూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేద్దామని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ యు.శ్రీనిత, జేవివి జాతీయ సమాచార కార్యదర్శి సనావుల్లా పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జడ్పీ ఉర్దూ హైస్కూల్‌లో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటుచేశారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.బాలనారాయణ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్ తదితరులు

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావంతో రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. పెన్నా, కుందూ, పాపాఘ్ని నదీ పరివాహక ప్రాంతాలు, బద్వేల్ రెవెన్యూ డివిజన్‌ప్రాంతంలో వరి, అరటి, మినుము, కంది, మొక్కజొన్న, పత్తి, చామంతి పూలు, ఇతర వాణిజ్య పంటలు, ఉద్యానపంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని తెలిపారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామ్మోహన్, మనోహర్, అన్వేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ప్రారంభమైన గౌరీదేవి కార్తీక ఉత్సవాలు

వేంపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని సంగం వీధిలో వెలసిన మంగళగౌరీదేవి కార్తీక మహోత్సవ వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. మంగళగౌరీదేవి ప్రతిమను పసుపుముద్దతో తయారుచేసి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేక పూజలు నిర్వహించారు. రాత్రికి గాయత్రిదేవిగా అలంకరించి పూజలు చేశారు. బలిజసంఘం అధ్యక్షుడు నంబూరు కుళాయప్ప, కటిక చంద్రశేఖర్, ఇతర పెద్దలు పాల్గొన్నారు.


గౌరీదేవి

హోంగార్డ్స్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం


మాట్లాడుతున్న మహేశ్‌కుమార్

కడప క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) :హోంగార్డ్స్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కమాండెంట్ ఎం.మహేశ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఉమేశ్‌చంద్ర కళ్యాణ మండపంలో హోంగార్డులకు దర్బార్ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ హోంగార్డు సంక్షేమానికి జిల్లా ఎస్పీ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టరు శ్రీశైలరెడ్డి, హోంగార్డ్సు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయికి హిమకుంట్ల విద్యార్థి ఎంపిక

సింహాద్రిపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పులివెందుల నియోజకవర్గ స్థాయిలో శనివారం పులివెందులలో జరిగిన వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలలో హిమకుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి డి. నాగవైష్ణవి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఎంఈవో-1 ఖాదర్‌బాషా తెలిపారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన మూడు పాఠశాలల నుంచి ముగ్గురు విద్యార్థులు నియోజకవర్గ పోటీలలో పాల్గొన్నారు.


నాగవైష్ణవి

దశాబ్దాలుగా రోడ్లు, కాల్వలకు నోచుకోని పేదల కాలనీలు


నగర సమస్యల పరిశీలనలో సీపీఐ బృందం

కడప సెవెన్ రోడ్స్ నవంబరు1 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలు గడుస్తున్నా నగరంలోని అనేక ప్రాంతాలు తాగు నీరు, రోడ్లు, మురుగు కాల్వలు తదితర మౌలిక వసతులకు ఆమడ దూరంలో పేదల కాలనీలుఉండడం దారుణమని సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక సమస్యలపై 14, 16వ డివిజన్‌లలో సీపీఐ నాయకులు ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ మౌలిక స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సౌత్‌జోన్ నాయకులు పగడపూల మల్లికార్జున, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



పట్టణ ప్రజలకు ఆటవిడుపుగా ఏర్పాటు చేసిన పార్క్ అసాంఘిక కార్యక్రమాలకు నిలయమైంది. పట్టణ వాసుల వినోదానికి మేం అవకాశం కల్పిస్తున్నామని ఆర్భాటంగా ప్రచారం చేసుకున్న వైసీపీ ప్రభుత్వంలోనే పార్క్ అంటే భయం గొలిపేలా తయారైంది. కోట్ల రూపాయలు విలువైన రెండు ఎకరాల దేవాలయ స్థలంలో రూ. 20 లక్షలతో నిర్మించిన ఉద్యానవనం నిరుపయోగంగా మారి పట్టణ వాసులను ఉసూరుమనిపించింది.

అటకెక్కిన 'ఆటవిడుపు'

- అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిన పార్కు
- పెరిగిపోయిన పిచ్చిమొక్కలు
- తుప్పుపట్టిన పరికరాలు, ధ్వంసమైన బల్లలు
- పాలకుల ఆరంభ శూరత్వం
- కొద్ది రోజులకే కొరవడిన పర్యవేక్షణ

పీలేరు రూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్య, వ్యాపార కేంద్రంగా అభివృద్ధి సంతరించుకుంటున్న పీలేరు పట్టణంలో ఉద్యానవనం ఏర్పాటు విషయంలో పాలకులు ప్రజలను ఊరిస్తూ వచ్చారు. సుమారు 60 వేల జనాభా ఉన్న పట్టణంలోని ప్రజలు ఆటవిడుపుకోసం వారాంతాల్లో తిరుపతి, హార్సిలీహిల్స్ తదితర ప్రాంతాలకు వెళ్లేవారు. అయితే, వైసీపీ ప్రభుత్వంలో సర్వే నెంబర్ 493లో శివాలయానికి చెందిన రూ.15 కోట్ల విలువైన రెండెకరాల స్థలంలో రూ. 20 లక్షలతో కాశీవిశాలాక్షీ ఉద్యానవనం ప్రారంభించారు. ఇందులో పెద్దలకు అనుకూలంగా వాకింగ్ ట్రాక్, విశ్రాంత బల్లలు ఏర్పాటు చేశారు. ఆహ్లాదకర వాతావరణం కల్పించడం కోసం వివిధ రకాల పూలమొక్కలు, పచ్చదనం నింపేలా స్పాంజ్ గ్రాస్ ఏర్పాటు చేశారు. చిన్న పిల్లల కోసం జారుడు బల్లలు, ఉయ్యాల తదితర పరికరాలు ఏర్పాటు చేశారు. చిన్నచిన్న ఫంక్షన్లు చేసుకు నేందుకు ఓపెన్ ఆడిటోరియం ఏర్పాటు చేశారు. దీంతో కొంత కాలం పార్క్ కళకళలాడింది. అయితే పార్కు నిర్వహణ బాధ్యతలు నిర్వహించాల్సిన పాలకులు, అధికారులు బాధ్యతలను గాలికి వదిలేశారు. ఉద్యానవనానికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం, ప్రారంభించిన పాలకవర్గం అధికారంలో కొనసాగుతున్నా పార్క్ నిర్లక్ష్యానికి గురైంది. ఫలితంగా ఉద్యానవనం అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారింది. దీంతో మహిళలు, వృద్ధులు పార్కుకు వెళ్లేందుకు భయపడుతున్నారు. అధికారులు, పోలీస్ పర్యవేక్షణ కొరవడడం, రెండేళ్లకే పార్క్‌ను వదిలేయడం, కనీసం పంచాయతీ అధికారులు సైతం పార్క్ నిర్వహణపై దృష్టి సారించకపోవడంపై విమర్శలు గుప్పుమంటు న్నాయి.



అధ్వానంగా మారిన వాకింగ్ ట్రాక్


విరిగి పోయిన బల్లలు

అల్లుకుపోయిన పిచ్చిమొక్కలు...

పట్టణ ప్రజల ఆటవిడుపు కోసం ఏర్పాటు చేసిన పార్క్ మొత్తం పిచ్చిమొక్కలు అల్లుకు పోయి దర్శనమిస్తున్నాయి. వాకర్లు పాముల భయంతో హడలిపోతున్నారు. పచ్చదనం, పరిశుభ్రతకు నోచుకోక పోవడం విచారకరం. చిన్నపిల్లల ఆటవిడుపు కోసం ఏర్పాటు చేసిన పరికరాలు తుప్పుపట్టి నిరుపయోగంగా మారాయి. మరో వైపు పెద్దలు, మహిళలు సేద తీరడం కోసం ఏర్పాటు చేసిన బల్లలను సైతం ధ్వంసం చేయడం గమనార్హం.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతాం..



పట్టణ అభివృద్ధికి అనుగుణంగా పార్క్ ఏర్పాటు తప్పని సరి. వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన పార్క్ నిరాదరణకు గురవడం వారి వైఫల్యమే. పార్కును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళతాం. పట్టణ అభివృద్ధికి అనుగుణంగా పార్క్‌ను ముందుకు తీసుకెళతాం.

- గొల్ల కిశోర్ నాయుడు, ఏఎంసీ డైరెక్టర్, పీలేరు

అభివృద్ధి చేయాలి



పట్టణ ప్రజల ఆటవిడుపు కోసం శిథిలావస్థకు చేరిన పార్క్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అనతి కాలంలోనే పార్క్ అక్కరకు రాకుండా పోవడం శోచనీయం. గ్రామ పంచా యతీ అధికారులు, పాలక వర్గం వాస్తవ పరిస్థితులను గుర్తించి సమన్వయంతో ముందుకు పోవాలి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్క్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ఏ. విశ్వనాథరెడ్డి, టీచర్, పీలేరు

ఆటో బోల్తా.. విద్యార్థినులకు గాయాలు


విద్యార్థులను పరామర్శిస్తున్న ఎంఈవో , ప్రిన్సిపాల్

తంబళ్లపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కుక్కలు అడ్డురావడంతో ఆటో బోల్తా పడి ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. రామిగానిపల్లె, కురవపల్లె, పెండేరివారిపల్లెకు చెంది న సుమారు 12 మంది విద్యార్థులు శనివారం ఉదయం ఆటోలో పాఠశాలకు వెళ్తుండగా.. అడ్డుగా వచ్చిన కుక్కలను తప్పించే యత్నంలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 7వ తరగతి విద్యార్థిని స్వాతి, 8వ తరగతి విద్యార్థినులు శృతి, వెన్నెల స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసు కున్న ఎంఈఓ త్యాగరాజు, ప్రిన్సిపాల్ హేమంత్ కుమార్ విద్యార్థినులను పరామర్శించారు.

బాలుడి ఆచూకీ కోసం గాలింపు

తంబళ్లపల్లె, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన విద్యార్థి చరణ్ కోసం పోలీసులు, హాస్టల్ ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లితండ్రులు ముమ్మరంగా గాలిస్తున్నారు. తంబళ్లపల్లె ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థి చరణ్ శుక్రవారం తెల్లవారుజామున హాస్టల్ నుంచి అదృశ్యమైన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం తంబళ్లపల్లె-మదనపల్లె రోడ్డులో నడుచుకుని వెళ్లినట్లు రామిగానిపల్లె సమీపంలో ఉన్న ఓ సీసీ కెమెరా ద్వారా పోలీసులు గుర్తించారు. శనివారం తెల్లవారుజాము నుంచి హాస్టల్ సిబ్బంది, విద్యార్థి తల్లితండ్రులు, పోలీసులు సుమారు ఎనిమిది బృందాలుగా ఏర్పడి పలు ప్రాంతాల్లో ముమ్మరంగా గాలించారు. ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తంబళ్లపల్లె నుంచి కన్నెమడుగు, ముదివేడు, మదనపల్లె వరకు రోడ్డుకు పలు చోట్ల ఉన్న సీసీ కెమెరాలను నిశితంగా పరిశీలించారు. హాస్టల్ సిబ్బంది, విద్యార్థి తల్లితండ్రులు కురబలకోట, ములకలచెరువు, మదనపల్లె, గుర్రంకొండ, నిమ్మనపల్లె, రైల్వే స్టేషన్లు తదితర చోట్ల తీవ్రంగా గాలించారు. శనివారం సాయంత్రం వరకు విద్యార్థి ఆచూకీ లభ్యం కాలేదని హాస్టల్ ఉపాధ్యాయులు తెలిపారు.

ముగ్గురు దొంగల అరెస్ట్


నిందితులు, చోరీ సొత్తును చూపుతున్న ఎస్ఐ

ధర్మవరంరూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలను శనివారం ఆయన స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. ఇటీవల చిగిచెర్ల గ్రామంలోని వీరముద్దప్ప గుడి, గొట్లూరులో మహంకాళమ్మ, పెద్దమ్మ గుడి, రాంపురంలోని సత్యమ్మ ఆలయాల్లో జరిగిన చోరీలపై కేసులు నమోదు చేశామన్నారు. వీటిపై పలు కోణాల్లో విచారణ చేసి నిందితులను గుర్తించామన్నారు. అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన గురునాథం అంజయ్య, గురునాథం ఆంజనేయులు, కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా ఎగువపల్లికి చెందిన గురునాథం వెంకటేశ్వర్లు చోరీలు చేసినట్లు నిర్ధారించుకుని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 30 వెండి గొడుగులు, (340గ్రాములు) మూడు గ్రాముల బంగారం తాళిబొట్లు రెండు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముగ్గురు ఊరు చివరన ఉన్న ఆలయాలపై రెక్కీ నిర్వహించి, రాత్రి పూట చోరీలకు పాల్పడేవారని తెలిపారు.

అంగన్వాడీ వర్కర్స్ నూతన కమిటీ ఎన్నిక

పెనగలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఐసీడీఎస్ చిత్తూరు ప్రాజెక్టు నూతన కమిటీ శనివారం బెస్తపల్లె అంగన్వాడీ కేంద్రంలో ఎన్నికైంది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన ఎన్నికలు జరిగాయి. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు, వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చిట్వేలి ప్రాజెక్టు అధ్యక్షురాలిగా అన్నపూర్ణమ్మ, ప్రధాన కార్యదర్శిగా వసంత, కోశాధికారిగా ఉమామహేశ్వరి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుధామణి, సహాయ కార్యదర్శిగా సుజాత, ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు తెలిపారు. అంగన్వాడీ వర్కర్‌లు, సహాయకులు హాజరయ్యారు.

వెంకయ్యనాయుడును కలిసిన పోతుగుంట

రాజంపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడును కలిసి సత్కరించారు. శ్రీశైలం దేవస్థానం చైర్మన్‌గా తాను ఎన్నికయ్యానని తెలియజేశారు. బొకే అందించి శాలువా కప్పి సత్కరించారు. ఒంటిమిట్ట మాజీ ఎంపీపీ బి.లక్ష్మీ నారాయణనాయుడు కలిశారు. శనివారం కడపకు విచ్చేసిన మాజీ ఉపరాష్ట్రపతిని ఈయన కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం మాజీ జడ్పీటీసీ చలమయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా వసతుల కల్పన

- రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అతిశయ


మాట్లాడుతున్న చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అతిశయ

మదనపల్లె టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఆధారంగా మెరుగైన వసతుల కల్పనకు అమృత్ సంవాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రైల్వే చీఫ్ కమర్షియల్‌ఇన్‌స్పెక్టర్ అతిశయ తెలిపారు. శనివారం మదనపల్లె మండలంలోని సీటీఎం (మదనపల్లె రోడ్డు) రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు, ప్రజలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ 2047 నాటి రైల్వే ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలను కల్పించ నున్నామన్నారు. అమృత్ స్టేషన్‌లలో స్టేషన్‌ల ఆధునికీకరణ, ఆధునిక టెక్నాలజీ, ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించేం దుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ప్రజలు కూడా వారి అభి ప్రాయాలను తెలియజేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఐ ఇంజినీర్ అజయ్ టెండూల్కర్, స్టేషన్ సూపరింటెండెంట్ జాబీర్‌బాషా, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల పరిశీలన


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కొండూరు శ్రీనివాసరాజు

మదనపల్లెఅర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పదో తర గతి పరీక్ష కేంద్రాలను శనివారం అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ కొండూరు శ్రీనివాస రాజు పరిశీలించారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో డెస్కులు, విద్యుత్, నీటి సౌకర్యం, ఫ్యాన్లు, తాగునీటి వసతి తదితర అంశాలపై ఆరా తీస్తు న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, డీఆవో కార్యాలయ సూపరింటెండెంట్ రవి, ప్రధానోపాధ్యాయులు పఠాన్ మహమ్మద్‌కాన్, సుబ్బారెడ్డి, షాజహాన్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

అంగళ్లులో సర్కిల్ పోలీసు స్టేషన్!


ముదివేడు పోలీసు స్టేషన్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

కురబలకోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని అంగళ్లలో సర్కిల్ పోలీసు స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటు న్నట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు.శనివారం మండలంలోని ముదివేడు పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగళ్లు సమీపంలో సర్కిల్ పోలీసు స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించిందని, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ అధి కారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలను అందించారన్నారు. అనుమతులు రాగానే భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల సమీపంలో గంజాయి నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్ఐ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి గాయపడిన వ్యక్తిని 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కురబకోట మండలం, రెడ్డివారిపల్లెకు చెందిన మునివెంకటప్ప కుమారుడు నరసింహులు అంగళ్లు నుంచి సీటీఎంకు వెళుతుండగా సీటీఎం క్రాస్ రోడ్డు వద్ద బైక్ అదుపు తప్పడంతో నరసింహులు గాయపడ్డాడు. మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స అనంతరం డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

అమరజీవి త్యాగఫలమే ఆంధ్రరాష్ట్ర అవతరణ


పొట్టిశ్రీరాములుకు నివాళులర్పిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగఫలంతోనే ఆంధ్ర రాష్ట్ర అవతణ జరిగిందని బీజేపీ సీనియర్ నాయకుడు తోట శ్రీనివాసులు తెలిపారు. శనివారం రైల్వేకోడూరులో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ అధ్యక్షుడు దరిశా వెంకటరెడ్డి, బీజేపీ పార్టీ అధ్యక్షుడు సాయం శ్రీధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణ యత్నం అడ్డుకున్నందుకు దాడి

మదనపల్లె అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణ యత్నాన్ని అడ్డుకున్నందుకు భూమి యజమానిపై ఆక్రమణదారులు దాడి చేసి గాయపరిచారు. జిల్లా ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు బి.కొత్తకోటకు చెందిన ఎం. గంగిరెడ్డికి బి.కొత్తకోటలో 22 సెంట్ల భూమి ఉంది. బి.కొత్తకోటకు చెందిన పీరుబాయ్, షఫి మరో పది మంది శనివారం ఆ భూమిని చదును చేస్తుండగా గంగిరెడ్డి అడ్డుకున్నాడు. దీంతో వారు అతనిపై మూకుమ్మడిగా దాడి చేసి గాయపర్చారు. స్థానికులు అతనిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు బి.కొత్తకోట పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.


యువతి అదృశ్యం.. కేసు నమోదు


గంగ

రామసముద్రం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బలిజ వీధికి చెందిన గంగ అనే యువతి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు శనివారం ఫిర్యాదు చేశారని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. అక్టోబరు 30 ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలే దని పలుచోట్ల వెదికినా గంగ జాడ కనిపించలేదని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బంధువుల నుంచి రక్షణ కల్పించండి

- విలేకరుల సమావేశంలో మహిళల ఆవేదన


మాట్లాడుతున్న బాధితులు

మదనపల్లె అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆస్తికోసం మేనత్త, ఆమె భర్త తమను చంపేందుకు ప్రయత్నం చేస్తున్నారని, నానమ్మ, తాతయ్యను మచ్చిక చేసుకుని తమ ఆస్తిని కొట్టేసేందుకు ప్రయత్ని స్తున్నారని, వారితో తమకు ప్రాణహాని ఉందని మానస, పావని, నవ్యశ్రీ అనే యువతులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో వారు మాట్లాడుతూ మదనపల్లె లోని నీరుగట్టువారిపల్లెకు చెందిన మంజుల, సురేష్‌కుమార్ దంపతులకు తాము ముగ్గురు కూతుళ్లమని, తెట్టు గ్రామం, గుంతపల్లె వంకలో రెండున్నర ఎకరాల పొలం, బి.కొత్తకోట మంఛిలం, కుమ్మరపల్లెలో రెండన్నర ఎకరాల పొలం, నీరుగట్టువారి పల్లెలో ఇళ్లు, రామిరెడ్డి లేవుట్‌లో ఐదు షాపురూములు, అక్కడక్కడ ఇంటి స్థలాలు ఉన్నాయన్నారు. ఏడాది క్రితం తమ తండ్రి సురేష్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెందాడని, ఇదే అదునుగా చేసుకుని మేనత్త కమలమ్మ, ఆమె భర్త సురేంద్ర తమ తండ్రికి చెందాల్సిన ఆస్తి మొత్తం కొట్టేయడానికి చూస్తున్నారని ఆరోపించారు. నాన్నమ్మ, తాతయ్యను మచ్చిక చేసుకుని వారి పేరిట ఉన్న ఆస్తులను రిజిస్టర్ చేయించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. ఇందుకు ఒప్పుకోక పోవడంతో తమ తల్లి మంజులను ,తమను అడ్డు తొలగించడానికి చూస్తున్నారని ఆరోపించారు. వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని ఉన్నతాధికారులను కోరుతున్నామ న్నారు. తమ తండ్రి ఆస్తి తమకు దక్కేలా న్యాయం చేయాలని అర్థిస్తున్నామన్నారు.

ప్రతి ఒక్కరూ.. రెండు మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న అటవీ శాఖ అధికారులు

పీలేరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ విధిగా రెండు మొక్కలు నాటి సంరక్షించాలని పీలేరు రేంజ్ అటవీ క్షేత్రాధికారి జయప్రసాద్ తెలిపారు. కార్తీక వన మహోత్సవంలో భా గంగా శనివారం కేవీపల్లె మండలం మారేళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. మొక్కుబడిగా నాటేసి వదిలేయడం వల్ల ఉపయోగం ఉండదని తెలిపారు. వాతావరణ కాలుష్యం రోజురోజుకూ పెరిగిపోతున్న కారణంగా అతివృష్టి అనావృష్టి వంటి సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములను చేయడం కోసం తరచూ ఇలాంటి కార్య క్రమాలు నిర్వహించాల్సిన ఆవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సబియాసుల్తానా, బీట్ అధికారులు బీ.రెడ్డి ఆసియా, జగదీష్, చంద్రకళ, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం వెంకటాద్రి

కలకడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ క్రీడా పోటీలకు నడిమిచెర్ల హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకటాద్రి తెలిపారు. ఇటీవల మంచూరు జడ్పీహైస్కూల్‌లో జరిగిన అండర్-17 జిల్లా స్థాయి పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు భానుప్రసాద్ (బాలుర), జ్ఞానప్రియ(బాలికల) విభాగంలో ప్రతిభ చూపినట్లు తెలిపారు. వీరు ఈ నెలలో విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలో జిల్లా తరఫున పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఏఎస్‌డబ్ల్యూఓ గంగిరెడ్డి, వెంకటాద్రి, రమేష్‌బాబు, శివానంద, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు రెడ్డివారిపల్లి విద్యార్థి


విద్యార్థి విక్రాంత్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నిమ్మనపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విక్రాంత్ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రియదర్శిని తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ అక్టోబరు కర్నూలులో జరిగిన ఎనిమిదో రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 7న ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో జరగనున్న 49వ జూనియర్స్ జాతీయ స్థా యి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక


విశ్వసాయి

మదనపల్లె టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న నెట్‌బాల్ పోటీలకు మదనపల్లెకు చెందిన మున్సిపల్ డీపీఓ శివప్రసాద్ కుమారుడు వెంకట విశ్వసాయి ఎంపికయ్యాడని పీడీ కమలేష్ తెలిపారు. గత నెలాఖరులో కొత్త మంచూరు జడ్పీహైస్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న విశ్వసాయి అండర్-17 నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ఎంపిక చేశారన్నారు. మున్సిపల్ ఉద్యోగులు ఆ విద్యార్థిని అభినందించారు.

క్రీడల్లో మెరిసిన మట్లి పెద్దూరు విద్యార్థులు


రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు


వీరబల్లి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్, బేస్‌బాల్ పోటీల్లో మట్లి పెద్దూరు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 16 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 సాఫ్ట్‌బాల్ విభాగంలో హర్షవర్ధన్, పవన్, రూప, అండర్-14 విభాగంలో రెడ్డిగీత, హేమశ్రీ, సినింద్రీ, సుబ్రమణ్యం, జగదీశ్, అండర్-17 బేస్‌బాల్‌లో రూప, హర్షవర్ధన్, పవన్, అండర్-14లో ఆర్. విష్ణువర్ధన్, సీ. జగదీశ్, జగదీశ్, సినింద్రీ, సుబ్రమణ్యం, రెడ్డి గాయత్రి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధాయుడు జయన్న తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ సంచాలకుడు జగదీశ్వరయ్యను ఉపాధ్యాయ బృందం, కమిటీ చైర్మన్ నాగేశ్వర్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు మడితాడు విద్యార్థులు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సుండుపల్లె, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు మడితాడు ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులు అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు అబీదుల్లా తెలిపారు. శనివారం పాఠశాలలో ఆయా విద్యార్థులకు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షేక్. ఇమ్రాన్ ఇక్బాల్, అండర్-17 వెస్ట్ గోదావరి జిల్లాలో అక్టోబర్ 20, 21, 22వ తేదీల్లో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చినట్లు తెలిపారు. కర్నూలు జిల్లా అహోబిలంలో జరిగిన పోటీల్లో ఇర్ఫాన్ అండర్-17 బేస్ బాల్ పోటీల్లో, కడప జిల్లా పులివెందుల పట్టణం ధ్యాన్‌చంద్ క్రీడా మైదానంలో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీ అండర్-14 విభాగంలో షేక్. ఇసాన్ ఇక్బాల్ ఉత్తమ ప్రతిభను కనపర్చిన రాష్ట్ర స్థాయి క్రీడలకు అర్హత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు ఆరీఫుల్లా, వ్యాయామ ఉపాధ్యాయుడు శివాజీనాయక్ పాల్గొన్నారు.

రాష్ట్ర నెట్‌బాల్ పోటీలకు మంచూరు విద్యార్థులు


రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

వాల్మీకిపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-17 నెట్ బాల్ పోటీ లకు వాల్మీకిపురం మండలం లోని కొత్తమంచూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపి కయ్యారు. శనివారం పాఠశా ల ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీల్లో పాఠశాలకు చెందిన పావని, మిషికుమారి విశేష ప్రతిభ కనబరిచి ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. త్వరలో విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఫిజికల్ డైరెక్టర్ రెడ్డి వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ప్రకాష్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి ప్రోత్సహించారు.

నేడు గోమాత కల్యాణోత్సవం

ఎర్రగుంట్ల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): లోకకళ్యాణార్థం ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి పెన్నానదీ తీరాన ఉన్న సంతోషిమాత ఆలయంలో గోమాత-వృషభరాజ కల్యాణోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు చాగంటి సత్యప్రసాద్‌వర్మ, చాగంటి పార్వతి తెలిపారు. ఉదయం 11.44గంటలకు కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం ఆలయంలో కనకదుర్గ అమ్మవారికి, సంతోషిమాతకు ప్రత్యేక అభిషేకాది పూజలు చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీశైలంకు ప్రత్యేక బస్ సర్వీసులు

మైదుకూరు నవంబరు1(ఆంధ్రజ్యోతి): కార్తిక మాసం పురష్కరించుకొని మైదుకూరు డిపో నుంచి ప్రతి కార్తీక సోమవారం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శ్రీలత తెలిపారు. ప్రతి సోమవారం సూపర్ లగ్జరీ సర్వీసు మైదుకూరులో ఉదయం 6:15గంటలకు బయలుదేరుతుందని, తిరిగి మధ్యాహ్నం 13:50గంటలకు శ్రీశైలంలో బయలుదేరుతుందన్నారు.శివ భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

బద్వేలు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు ఆర్టీసీ డిపో నుంచి కార్తీక మాసంలో శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం నిరంజన్ శనివారం ప్రకటనలో తెలిపారు. అరుణాచలంకు ఈ నెల 4న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ప్రతి ఆదివారం శ్రీశైలం, అరుణాచలంకు బస్సులు నడుపుతున్నామన్నారు. బద్వేలు, పోరుమామిళ్ల లోని భక్తులు 9959225779కు నెంబరుకు సంప్రదించాలన్నారు.

జిల్లా పోటీలకు ఎర్రగుంట్ల విద్యార్థులు

ఎర్రగుంట్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు ఎర్రగుంట్ల విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం నియోజవర్గ స్థాయి క్విజ్ పోటీల్లో ఎర్రగుంట్ల జడ్పీ హైస్కూల్ ఎం.సంగీత ప్రథమస్థానం, రాణీవనం జడ్పీ హైస్కూల్ నుంచి ఎస్.హామీరా తృతీయ స్థానం పొంది జిల్లా స్థాయికి ఎంపికైయ్యారు. ఈ విద్యార్థులను హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

మైదుకూరులో: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనేందుకు శనివారం ఎంపికలు నిర్వహించారు. స్థానిక మేధా డిఫెన్స్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎంపికలలో బద్వేల్ డివిజన్ లోని మైదుకూరు, బద్వేల్ నియోజకవర్గాలకు చెందిన అండర్ 14, అండర్17 జట్లకు బాల బాలికలను ఎంపిక చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ రామానాయక్ తెలిపారు. సీఐ రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఎంపీడీఓ నాగేంద్ర, హైస్కూల్ హెడ్మాస్టర్ ఇలియాస్ అహ్మద్ లు పాల్గొన్నారు. .ఈ ఎంపికలలో ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం


వ్రతం చేస్తున్న భక్తులు

మైదుకూరు రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : సాముహిక సత్య నారాయణస్వామి వ్రతం భక్తులు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక లక్ష్మీమాధవరాయ స్వామి ఆలయంలో శనివారం కార్తీక ఏకాదశి కావడంతో సాముహిక సత్యనారాయణ స్వామి వ్రతం ఆలయ నిర్వాహకులు బండి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో జరుపుకొన్నారు.

టీడీపీ నేత సహకారం

కలసపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీలోని హృదయపేటలో శనివారం స్థానిక టీడీపీ నేత జయరామిరెడ్డి తన సొంత ఖర్చులతో వీధుల్లో కంపచెట్లు తొలగించారు. శ్మశానానికి వెళ్లేదారి మూసుకుపోవడంతో అక్కడ దారిని బాగుచేయించారు. పంచాయతీ పరిధిలో ఎటువంటి సమస్యలున్న పరిష్కరిస్తానన్నారు.

పాఠశాలలకు కిట్లు మంజూరు

కాశినాయన నవంబరు1(ఆంధ్రజ్యోతి):మండలంలోని 10 ప్రభుత్వ పాఠశాలలకు జాదూయి పిఠార లెర్నింగ్ కిట్లు మంజూరయ్యాయనిఎంఈవోలు మహమ్మద్ షఫీ, నిర్మల తెలిపారు. ఆమేరకు నర్సాపురం ఎమ్మార్సీ కార్యాలయానికి వచ్చిన లెర్నింగ్ కిట్ల బాక్సులను నాయనపల్లె, వరికుంట్ల, ఇటుకులపాడు, వంకమర్రి, కేఎన్ కొట్టాల రెడ్డికొట్టాల పాఠశాలలకు అందజేశా మన్నారు. మిగిలిన బాక్సులను త్వరలో అందజేస్తామన్నారు.

18 మంది జూదరుల అరెస్టు

దువ్వూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలో శనివారం వేరు వేరు గ్రామాల్లో 18 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. గుడిపాడులో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి రూ.3,160 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. చిన్నసింగనపల్లెలో ఏడుగురురిని అరెస్టు చేసి రూ.2,900 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దాడిలో ట్రైనీ ఎస్‌ఐ జగదీశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కుంటలు కాదు.. రోడ్లే

- వర్షాలకు దెబ్బతిన్న రహదారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు
- తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలంటున్న జనం

దువ్వూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి):అసలే వర్షాలు.. ఆపై గ్రామీణ రోడ్ల గురించి చెప్పడానికి ఏముంది. ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై గుంతలు ఏర్పడి వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రజలు రాకపోకలకు ఇక్కట్లు తప్పడంలేదు. వర్షాలతో రోడ్ల రూపురేఖలు మారిపోయాయి. పాడైన రోడ్లతో జనాల పాట్లు అన్నీ ఇన్నీ కావు. దువ్వూరు మండలంలో పలు రోడ్ల దుస్థితి ఇలా ఉంది.

● మండలంలో రామాపురంకు వెళ్లే రోడ్డు దారుణంగా తయారైంది. వర్షాలు పడుతున్న నేపథ్యంలో రహదారి అతుకులు, గతుకులుగా తయారైంది. దీనిమీదుగా నీరు నిలిచి వాహనదారులు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. వాహనాల్లో వెళ్లే వ్యక్తులు అదుర్లకు బెంబేలెత్తుతున్నారు. వర్షాలకు రోడ్డు దారుణంగా మారింది. ఇక్కడి నుంచి వెల్లాలు కొట్టాలు, గొల్లపల్లె మీదుగా చల్లబసాయిపల్లెకు అటు నుంచి చిన్నసింగనపల్లె, పెద్దసింగనపల్లె, మదిరేపల్లె వరకు దారి దయనీయంగా ఉంది. పెద్దసింగనపల్లె నుంచి మదిరేపల్లికి వెళ్లే దారి వర్షం వస్తే కుంటను తలపిస్తోంది. ఈ సమయంలో వాహనాలు వెళ్లాలంటే చోదకులుహడలిపోతున్నారు. ఎర్రబల్లె నుంచి మాచనపల్లె, బుక్కాయపల్లె, అన్నవుశాస్త్రులపల్లి,


కాలువను తలపిస్తున్న పెద్దసింగనపల్లె-మదిరేపల్లె దారి


దుస్థితిలో రామాపురం రోడ్డు

భీమునిపాడుకు వెళ్లే తారు రోడ్డుసైతం దెబ్బతింది. గత వైసీపీ ప్రభుత్వ అయిదేళ్ల కాలంలో గ్రామీణ రోడ్ల బాగోగులు పట్టించుకోకపోవడంతో బాగా దెబ్బతిన్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పందించి మండలంలో దెబ్బతిన్న రోడ్లు బాగుకోసం తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అమరజీవి పొట్టిశ్రీరాములుకు ఘన నివాళి


అమరజీవికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సభ నాయకులు

ప్రొద్దుటూరు/టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురష్కరించుకుని ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘనంగా నివాళులర్పించారు. శనివారం అమ్మవారిశాల నుంచి ర్యాలీగా వచ్చి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలువేసి ఆర్యవైశ్య సభ నాయకులు ఘనంగా నివాళులర్పించారు . ఈ సందర్భంగా ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని 1952లో పొట్టి శ్రీరాములు మద్రాసులో 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరులయ్యారని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెనుగొండకు శ్రీ వాసవీ పెనుగొండ క్షేత్రంగా పేరు పెట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ సభ్యులు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. స్దానిక పొట్టి శ్రీరాములు విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పూల మాల వేసి నివాళులు అర్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ భాషా పాల్గొన్నారు.

రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో..


అమరజీవికి నివాళులర్పిస్తున్న ఎస్‌టీయూ నాయకులు

మైదుకూరు నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములుకు రాష్ట్రోపాధ్యాయ సంఘం ఘనంగా నివాళులర్పించింది. జిల్లా ప్రధాన కార్యదర్శి గోశెట్టి రామమోహన్ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్‌కూడలిలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఇలియాస్ అహ్మద్, ఎస్‌టీయూ నాయకులు విజయ్‌నరసింహ, ఆనంద్, బాలగంగాదర్‌తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పై అవగాహన అవసరం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సమస్యలపై విద్యార్థులకు అవగాహన అవసరమని ట్రాఫిక్ సీఐ రాజగోపాల్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో పట్టణంలో యువకులు డ్రైవింగ్ లైసెన్సు లేకుండానే వాహనాలు మితిమీరిన వేగంతో ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ గౌరీశంకర్, ప్రిన్సిపాల్ శారదాభవానీ, దావీదు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు పట్టణ అభివృద్ధికి సహకరించండి : ఆర్డీఓ


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రమోహన్

బద్వేలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆర్డీవో చంద్రమోహన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో షాపుల యజమానుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండు సమీపాన డ్రైనేజీ వద్ద రూములు నిర్మించడంతో చిన్నపాటి వర్షం వచ్చినా ప్రయాణికులు, పట్టణ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. డ్రైనేజీపై ఆక్రమణలు ఉండడంతో మైదుకూరు రోడ్డు ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద , సిద్దవటం రోడ్డులోని ఆర్టీసీ బస్టాండు వద్ద , నెల్లూరు రోడ్డులోని వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద నీరు నిలుస్తుండడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఇందుకు షాపు యజమానులకు ప్రత్యామ్నాయ ఏర్పాటు కల్పించి డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరిస్తామని షాపు యజమానులు సహకరించాలని ఆర్డీవో తెలిపారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి షాపు యజమానులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. మరోసారి సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, గోపవరం తహశీల్దారుత్రిభువన్‌రెడ్డి, బద్వేలు అర్బన్ , రూరల్ సీఐలు లింగప్ప, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చక్కటి భోజనం అందించాలి


స్మార్ట్ కిచెన్‌లో భోజనం పరిశీలిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తదితరులు

జమ్మలమడుగు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చక్కటి భోజన పౌష్టికాహారం అందించాలని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగులోని పతంగే రామన్నరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం స్మార్ట్ కిచెన్‌ను భూపేశ్‌రెడ్డి పరిశీలించారు. విద్యార్థులు చక్కగా చదవుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలన్నారు. అనం తరం పాఠశాల మైదానంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటరామిరెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గురుకుమార్, నాగూర్, మల్లికార్జున, పొన్నతోట శ్రీను, యనమల శ్రీనివాసులరెడ్డి, కల్లుట్ల మాబూవల్లి, నాగేంద్రయాదవ్, నవనీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రైతులు పండ్ల తోటలపై ఆసక్తి పెంచుకోండి

బి.కోడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రైతులందరూ ప్రభుత్వమందించే వంద శాతం సబ్సిడీతో 25 రకాల పండ్ల తోటలు వేసుకునేందుకు ఆసక్తి పెంచుకోవాలని ఎంపీపీ కోడూరు చెన్నమ్మ తెలిపారు. శనివారం ఎంపీడీఓ సభాభవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్యసమవేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో భాస్కర్‌రావు మాట్లాడుతూ వర్షాలకు తాగునీటి బోర్లలో కొత్త నీరు వచ్చి చేరుతున్నాయని వాటి వల్ల రోగాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయాధికారి కౌశిక మాట్లాడుతూ తుఫానుకు 228 ఎకరాలు వరి దెబ్బతిన్నదని ప్రతి గ్రామానికి వెళ్లి సర్వే చేశామని 33 శాతం వరి నీట మునిగితే దానిని పరిగనణ లోకి తీసుకుంటూ నివేదిక తయారు చేశామని తెలిపారు. పశువైద్యాధికారి మాట్లాడుతూ పశువుల్లో గొంతువాపు వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేయించాలని తెలిపారు. బద్వేలు సర్కిల్ ఇన్‌స్పెక్టరు క్రిష్ణయ్య మాట్లాడుతూ ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు బైకులు ఇవ్వవద్దని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దావీదు, మండల ఉపాధ్యక్షులు శేఖర్‌రెడ్డి, మాధవరెడ్డి, సర్పంచ్‌లు మునిరెడ్డి, లక్ష్మీనరసారెడ్డి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

చిత్తా గిరిప్రణీత్‌రెడ్డిని అభినందించిన ఎమ్మెల్సీ


చిత్త గిరి ప్రణీత్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ యువజన విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన చిత్తాగిరి ప్రణీత్‌రెడ్డిని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అభినందించారు. మాజీ సీఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధా, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి ఆదేశాల మేరకు చిత్త గిరిప్రణీత్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ నియామకం తెలిసిన వెంటనే పోరుమామాళ్ల నాయకులు, యువకులు గిరి ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో రంగసముద్రం సర్పంచ్ చిత్తరవిప్రకాశ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, కల్లూరు రమణారెడ్డి, కళ్యాణ్‌చక్రవర్తి, రాళ్లపల్లె నరసిం హులు, గాజులపల్లె రవిచంద్రారెడ్డి, రాజీవ్‌బాషా పాల్గొన్నారు.

సుందరయ్య కాలనీలో వసతులు కల్పించాలి


వర్షపునీటిలో నిలబడి నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సుందరయ్య కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. శనివారం ఆ పార్టీ నాయకులు కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షపునీటిలో నిలబడి అధికారుల నిర్లక్ష్యంపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీలు కాలనీలో రోడ్లుకానీ, కాలువలు కానీ నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయండి

దువ్వూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని జిల్లా పరిషత్ హైస్కూలులో జరుగుతున్న సెంట్రల్ కిచెన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని శనివారం పంచాయతీరాజ్ ఎస్‌ఈ మద్దెన్న సూచించారు. ఇక్కడ ర డిసెంబరు 15 నాటికి సెంట్రల్ కిచెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. పనులను నాణ్యతగా చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీరాజ్ డీఈ మధుసూదన్‌బాబు ఏఈ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ పరిహారం అందేలా చూస్తా

పెద్దముడియం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలతో నష్టపోయిన రైతులందరికీ పరిహారం వచ్చేలా కృషి చేస్తామని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. మండల పరిధిలోని నెమళ్లదిన్నె గ్రామంలో శనివారం వృద్ధులు, దివ్యాంగులు, మానసిక వికలాంగుల ఇళ్ల వద్దకు వెళ్లి భూపేష్‌రెడ్డి పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులతో ఆయన మాట్లాడారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంటు పురుషోత్తంరెడ్డి నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, విఘ్నేశ్వరరెడ్డి, మాధవీరెడ్డి పాల్గొన్నారు.

అట్లూరులో పింఛన్ల పంపిణీ


దివ్యాంగులకు పింఛను అందిస్తున్న టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి

అట్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్లను బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ సమన్వయకర్త రితీష్‌రెడ్డిల ఆదేశాల మేరకు శనివారం కొండూరులో మండల టీడీపీ అధ్యక్షుడు పాపు దిప్ను మల్లికార్జునరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అట్లూరు మండల టీడీ పీ మాజీ అధ్య క్షుడు మన్యం మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, బీఎల్‌ఏ గోపాల్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు అల్లం వెంకట సుబ్బయ్య, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బద్వేలును కడప జిల్లాలోనే కొనసాగించాలి

బద్వేలు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బద్వేలు నియోజక్వర్గాన్ని రాజంపేట జిల్లాలో కలపకుండా కడప జిల్లాలోనే కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నాగదాసరి ఇమ్మానుయేల్ అధ్యక్షతన నియోజకవర్గంలోని మేధావులతో శనివారం స్థానిక జేవీ భవన్ లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బద్వే లు ప్రాంత ప్రజలకు కడపతో వారి జీవన విధానం ముడి పడి ఉంద న్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు బాలు, నియోజకవర్గ కార్యదర్శి మస్తాన్, దళిత నాయకులు నారాయణ, అంబేడ్కర్ విగ్రహ కమిటీ, ప్రజాసంఘల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మైదుకూరు నవంబరు1(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రొద్దుటూరు మండలం కల్లూరు కు చెందిన అజీజ్ బాషా, బాబులు ద్విచక్ర వాహనంలో తమ గ్రామానికి వెలుతుండగా ప్రొద్దుటూరు రోడ్డులో కొత్త బైపాస్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. 108 కు సమాచారం ఇవ్వడంతో వారిని మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.